RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 304 శుక్రవారం 28 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## ఆమ్కా జెట్‌ల రేసులో..హైదరాబాదీ సంస్థతో అదానీ జట్టు

హైదరాబాద్ : దేశీయంగా అభివృద్ధి చేయనున్న ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్)' ప్రొటోటైప్ తయారీ రేసులో హైదరాబాదీ సంస్థ కూడా భాగస్వామ్యం అవుతోంది. ఆమ్కా ప్రొటోటైప్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు అదానీ గ్రూపులోని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తాజాగా హైదరాబాద్‌కు చెందిన 'ఎంటార్ టెక్నాలజీస్' సంస్థతో జట్టుకట్టినట్టు తెలిసింది. విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ దీనిపై కథనాన్ని ప్రచురించింది. ప్రెసిషన్ ఇంజనీరింగ్ (కీలకమైన పరికరాలు, విడిభాగాలను ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత కచ్చితత్వంతో తయారు చేయడం)లో ఎంటార్ టెక్నాలజీస్ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, ఇస్రో, డీఆర్‌డీవో తదితర సంస్థలకు ఎన్నో సంస్థలు ఎంటార్ టెక్నాలజీస్ కస్టమర్లుగా ఉన్నాయి. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లకు అవసరమైన ఎలక్ట్రో న్యూమాటిక్ వ్యవస్థలను ఈ సంస్థే సరఫరా చేసింది.




హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని ఆయన్ని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

# హైదరాబాద్ లో ఏరోస్పేస్ క్యాంపస్

## తొలి ప్రైవేట్ రాకెట్ ఆవిష్కరించిన మోడీ..!

అంతరిక్ష ప్రయోగాల కోసం ప్రైవేట్ రంగానికి తలుపులు తెరిచిన కేంద్రం.. ఇందులో భాగంగా దేశంలో జరుగుతున్న పరిశోధనల్ని కూడా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ హైదరాబాద్ లో నిర్మించిన ఇన్ఫినిటీ క్యాంపస్ ను ప్రధాని మోడీ ఇవాళ ఢిల్లీ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1ను కూడా ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని ఇమారత్ లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ఈ క్యాంపస్ ను అభివృద్ధి చేసింది. ఇందులోనే తొలి దేశీయ ప్రైవేట్ రాకెట్ విక్రమ్ 1 అభివృద్ధి చేస్తున్నారు. దీన్ని ఇవాళ ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ఇది లో ఎర్త్ ఆర్బిట్‌లోకి బహుళ-ఉపగ్రహ విస్తరణ సామర్థ్యం కలిగి ఉంటుంది. 2 లక్షల చదరపు అడుగుల ఈ క్యాంపస్ నెలవారీ ప్రయోగ సామర్థ్యంతో ఎండ్-టు-ఎండ్ రాకెట్ ఉత్పత్తికి అనుకూలంగా ఏర్పాటు చేశారు. అంతరిక్ష ప్రయోగాల పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ పేరు మీద అధునాతన కార్బన్-ఫైబర్ టెక్నాలజీతో విక్రమ్-I ప్రైవేట్ రాకెట్ ను తయారు చేశారు. ప్రపంచ చిన్న ఉపగ్రహ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని దీన్ని అభివృద్ధి చేసారు. తొలి దేశీయ ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 ను ఓ సాంకేతిక అద్భుతంగా చెప్తున్నారు. ఇది తక్కువ ఎత్తు భూకక్షకు దాదాపు 300 కిలోల పేలోడ్‌లను మోసుకెళ్లడానికి వీలుగా తయారు చేశారు. ఈ శ్రేణిలో ఇతర రాకెట్లకు భిన్నంగా పూర్తిగా కార్బన్-ఫైబర్ బాడీతో దీన్ని నిర్మించారు. మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు ఉమ్మడిగా స్థాపించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ.. 2030 నాటికి భారతదేశాన్ని అంతరిక్ష ప్రయోగాల్లో మేటిగా నిలబెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. ఇవాళ ఈ కార్యక్రమాల్లో వర్చువల్ గా పాల్గొన్న ప్రధాని మోడీ.. దశాబ్దాలుగా భారతదేశ అంతరిక్ష ప్రయాణానికి శక్తినిచ్చినందుకు ఇస్రోను ప్రశంసించారు. దాని విశ్వసనీయత, సామర్థ్యం, ప్రత్యేకమైన ప్రపంచ గుర్తింపును రూపొందించడంలో విలువైన సంస్థగా దీన్ని అభివర్ణించారు. ప్రైవేట్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష రంగంలో ఎన్నో అవకాశాలు రాబోతున్నాయని ప్రధాని తెలిపారు. యువత ఆవిష్కరణలు, రిస్క్ తీసుకోవడం , వ్యవస్థాపకత కొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయని మోడీ పేర్కొన్నారు.





# డీకేకి ఛాన్స్ ఇస్తే.. సిద్ధరామయ్య ప్లాన్ ఏంటి?

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అటు సీఎం సిద్ధరామయ్య, ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఢిల్లీ బాట పట్టడంతో కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒక వేళ కాంగ్రెస్ అధిష్టానం డీకేను ప్రమోట్ చేయాలనుకుంటే సిద్ధరామయ్య ' ప్లాన్' ఏంటి అనేది చర్చనీయాంశంగా మారింది. సిద్ధరామయ్యే పూర్తికాలం సీఎంగా ఉంటారని డీకే శివకుమార్,ఐదేళ్లు తానే సీఎంనని సిద్ధరామయ్య ప్రకటించినప్పటికీ ఇది అంత తేలిగ్గా పరిష్కారమవుతుందా అనేది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జోక్యం తరువాత అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను, సిద్ధరామయ్య కట్టుబడి ఉండాలని ప్రకటించి నప్పటికీ ఈ పొలిటికల్ డ్రామాకు ఇంకా ఫుల్ స్టాప్ పడలేదు. ఒక వేళ ఉప ముఖ్యమంత్రి డీకేను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే, సిద్ధరామయ్య శిబిరం ఆయన్ను పదవిలో కొనసాగించాలని ఒత్తిడి తీసుకురావడానికి సకల అస్త్రాలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ బహిరంగంగా డీకే వైపే మొగ్గుచూపుతున్నారని సిద్ధరామయ్య మద్దతుదారులు భావిస్తున్నారు. ఇదే జరిగితే నిరసనకు సిద్ధంగా ఉన్నారు. పార్టీ ఇంకా కొత్త ముఖ్యమంత్రి కోసం పట్టుబడుతుంటే, వారికి ప్రత్యామ్నాయ జాబితాను అందజేయ నున్నారట.

అందులో ఒకటి సిద్ధరామయ్య మద్దతుదారుడు, దళిత నాయకుడు హోంమంత్రి జి. పరమేశ్వర కావచ్చని అంచనా. ఈ సందర్భంగా తానెప్పుడూ ముఖ్యమంత్రి రేసులో ఉన్నానన్న వ్యాఖ్యలు గమనించ దగ్గవి. దీనిపై సిద్ధరామయ్య విధేయుడు, పిడబ్ల్యూడి మంత్రి సతీష్ జార్కిహోలి నేతృత్వంలో బుధవారం జరిగిన సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం. మరోవైపు ఖర్గే, గాంధీలో డిసెంబరు




1 నాటికి దీనిపై ఒక నిర్ణయం ప్రకటించవచ్చని అంచనాలు వెలువడుతున్నాయి.

**ఎవరి పంతం నెగ్గుతుంది?....** మరోవైపు సిద్ధరామయ్య తన అధికారాన్ని మరింత బలపర్చుకునేందుంకు తన మంత్రివ ర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని కూడా యోచిస్తున్నారట. ఆయన ఎమ్మెల్యేల మద్దతు ఇంకా పెద్ద సంఖ్యలోనే ఉంది. ఈ నేపథ్యంలోసిద్ధరామయ్య గెలుస్తారా లేదా డికె శివకుమార్ తను కోరుకున్నది సాధిస్తారా? 2028లో తదుపరి ఎన్నికల వరకూ దీన్ని సర్దు బాటు చేస్తారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. కాగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించినప్పటి నుండి అత్యున్నత పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన తర్వాత చెరో రెండున్నరేళ్లు సీఎం పదవిని పంచుకోవాలని అప్పట్లో కాంగ్రెస్ హైకమాండ్ ఒప్పందం చేసింది. ప్రస్తుతం, ఈ సమయం అయిపోవడంతో డీకే వర్గం నాయకత్వ మార్పు గురించి కాంగ్రెస్ అధిష్టానంపై పట్టు పెంచుతోంది. ఈ నేపథ్యంలో అధిష్టానం ఈ ఉత్కంఠకు ఎలా తెరదించుతుందో వేచి చూడాలి.




హైదరాబాద్: తెలంగాణలో 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా.. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2015-16 గ్రూప్-2ను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. నాటి ఎంపిక జాబితాను కొట్టివేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం, తుడిపివేతలున్న పార్ట్-బి పత్రాలను పునర్ మూల్యాంకనం చేయడం చెల్లదని పేర్కొంది. హైకోర్టు తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా వ్యవహరించే అధికారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేదని తేల్చి చెప్పింది. జవాబు పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగిందని స్పష్టంగా కనిపిస్తున్నపుడు వాటిని పక్కన పెట్టకపోవడం కమిషన్ వైఫల్యమేనని తేల్చి చెప్పింది. 2019 అక్టోబరు 24న ఇచ్చిన ఫలితాలు ఏకపక్షమని, చట్టవిరుద్ధమని వాటిని రద్దు చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులు, హైకోర్టు తీర్పునకు అనుగుణంగా తిరిగి మూల్యాంకనం నిర్వహించి అర్హుల జాబితాను విడుదల చేసి నియామకాలు చేపట్టాలని, ఈ ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది.



# అమరావతికి వరుస కట్టిన బ్యాంకులు!

## ఒకేసారి 15.. ఏ రాజధానికి లేని ఛాన్స్ అమరావతికి!!

## నేడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ నేతృత్వంలో శ్రీకారం

అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. భారీగా నిధులు కూడా కేటాయించింది. రోడ్డుతో పాటు రైల్వే ప్రాజెక్టులను సైతం మంజూరు చేసింది. అయితే ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి అమరావతికి ఫుల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టనుంది. రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం తో పాటు ఏకంగా 15 జాతీయ, ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈనెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో ఒకేసారి శంకుస్థాపనలు కూడా జరగనున్నాయి.

ఇది నిజంగా రికార్డ్. ఒక విధంగా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టే.

**50 ఎకరాలు కేటాయింపు..** అమరావతిలో ఆర్బిఐ తో పాటు బ్యాంకులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. అందులో ఓ 12 ఎక్కరాలు రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు అధికారులతో పాటు సిబ్బంది క్వార్టర్స్ కోసం కేటాయించారు. మిగతా ఓ 38 ఎకరాల్లో దేశంలో పేరు మోసిన బ్యాంకులకు సంబంధించిన ప్రాంతీయు కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి.

సాధారణంగా బ్యాంకింగ్ సెక్టార్ అంటేనే కేంద్ర ఆర్థిక శాఖతో కూడుకున్నది. పైగా వాటి నిర్మాణాలు కూడా చాలా వేగంగా జరుపుతారు. వచ్చే రెండేళ్లలో అమరావతిలో ఈ బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అదే జరిగితే ఆర్థిక శాఖ పరంగా కూడా అమరావతి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం ఖాయం.

**వెనక్కి తగ్గిన వైసిపి..** అమరావతి విషయంలో ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గింది. వర్షాలు వచ్చే సమయంలో అమరావతికి వరద పోటు అంటూ ప్రచారం చేసేది. అయితే కేంద్రం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో వైసిపి ఆలోచనలో పడింది. అయితే ఇప్పుడు ఈ ఆర్థిక బ్యాంకులు అందుబాటులోకి వస్తే అమరావతిపై జరిగే వ్యతిరేక ప్రచారానికి చెక్ పడినట్టే. 2014 నుంచి 2018 మధ్య తెలుగుదేశం ఎన్డీఏలో కీలక భాగస్వామి. కానీ ఇటువంటి పరిణామాలేవి అమరావతి విషయంలో జరగలేదు. మునుపెన్నడూ లేని విధంగా అమరావతి విషయంలో కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పుడు ఆర్థిక శాఖకు సంబంధించిన బ్యాంకులు అందుబాటులోకి వస్తే అమరావతి ఆర్థిక రాజధానిగా మిగతా రాష్ట్రాలు గుర్తించడం ఖాయం. ఎందుకంటే ఒకే చోట 25 జాతీయ బ్యాంకులు, వాటి ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు చిన్న విషయం కాదు. ఈ విషయంలో మాత్రం మిగతా రాజధానుల కంటే అమరావతి మెరుగైన స్థితిలో ఉన్నట్టే.

# సంపాదకీయం

## టెకీల కష్టాలు

### రెపిడో డ్రైవర్లుగా మారి ఇళ్ల అద్దెల కోసం పోరాటం

గ్రేటర్ నోయిడా నుండి బెంగళూరు, హైదరాబాద్ వంటి దేశంలోని ప్రధాన నగరాల్లోని ఐటీ ఉద్యోగుల పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది. విస్తృత స్థాయిలో జరుగుతున్న లేఆఫ్ లు, తగ్గుతున్న కొత్త అవకాశాలు, ఉద్యోగ భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి.. ఇవన్నీ కలిసి అనేక ఐటీ కుటుంబాల ఆర్థిక పునాదులను తీవ్రంగా కుదిపేశాయి.

**ఇఎంఐ భారం: ఊపిరి బిగపట్టే స్థితి...** ఐటీ ఉద్యోగులకు అతిపెద్ద ఆర్థిక భారంగా మారింది వారి హెూమ్ లోన్ ఇఎంఐలు. నెలనెలా చెల్లించాల్సిన ఈ భారీ చెల్లింపులు ఉద్యోగం కోల్పోయిన వెంటనే అసాధ్యంగా మారాయి. ఆదాయం లేకుండా భారీ ఇఎంఐలను ఎలా భరించాలి? అనే భయం అనేక మందిని వెంటాడుతోంది. ఇఎంఐ డిఫాల్ట్ అయ్యే ప్రమాదం పెరుగుతుందనే ఆందోళనతో కొంతమంది టెకీలు తమ అపార్ట్‌మెంట్‌లను అమ్మకానికి కూడా పెట్టేశారు. ఏళ్ల కష్టంతో కొన్న ఇంటిని విడిచి పెట్టడం వారికి బాధగా ఉన్నా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు వారిని ఈ కఠినమైన నిర్ణయం తీసుకునేలా నెట్టేస్తున్నాయి.

**అద్దె ఇళ్లు... అయినా భారమే...** ఫ్లాట్లు అమ్మేసి కొందరు మళ్లీ అద్దె ఇళ్లకు మారుతున్నారు. నగరాల్లో నెలకు 20,000 నుండి 30,000 వరకు ఉన్న అద్దెలు కూడా ఉద్యోగం లేని కుటుంబాలకు పెద్ద సవాలుగా ఉన్నాయి. అయినప్పటికీ, భారీ ఇఎంఐ కంటే ఈ అద్దె ఓ కొద్దిగా భరించగలిగే ఎంపికగా కనిపిస్తోంది.

**బతుకు దెరువు కోసం రెపిడో డ్రైవింగ్...** ఉద్యోగాలు కోల్పోయిన అనేక మంది టెకీలు బతుకుదెరువు కోసం కొత్త మార్గాలు వెతుకుతున్నారు. అందులో భాగంగా కొంతమంది రెపిడో డ్రైవర్లుగా పనిచేయడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఏసీ ఆఫీసుల్లో కూర్చుని పనిచేసిన వారు.. ఇప్పుడు రోడ్ల మీద బైక్ టాక్సీలను నడుపుతూ జీవనోపాధి కోసం పోరాడుతున్నారు. వారి మాటల్లో... "ఇది మనం ఎప్పుడూ ఊహించుకున్న జీవితం కాదు.

కానీ కుటుంబాన్ని నెట్టుకొచ్చుకోవడం కోసం మరో మార్గం లేదు. అద్దె కట్టాలన్నా, నిత్యవసరాలు కొనాలన్నా కష్టపడక తప్పట్లేదు." అని నిట్టూరుస్తున్నారు.

**లేఆఫ్ ల దెబ్బ: ఏఐ ప్రభావం స్పష్టం...** ఐటీ రంగాన్ని ప్రభావితం చేస్తున్న ఈ సంక్షోభం ఒక్కరోజులో రాలేదు. దీనికి అనేక అంశాలు దోహదపడుతున్నాయి. భారీ స్థాయి లేఆఫ్ లు ప్రధాన కారణం. కొత్త అవకాశాలు, ప్రాజెక్టులు తగ్గిపోవడం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పనులను ఆటోమేట్ చేయడం.. ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు పడిపోవడం.. ఈ పరిణామాలు ఐటీ ఉద్యోగుల జీవనాన్ని పూర్తిగా మార్చేశాయి. అభివృద్ధి, అపారమైన అవకాశాలకు మారుపేరుగా భావించిన ఐటీ రంగం, ఇప్పుడు అనేక కుటుంబాలకు ఆర్థిక ఒత్తిడి, భయాందోళనలకు కారణమవుతోంది. ఇళ్ల అద్దెల కోసం టెకీలు రెపిడో డ్రైవర్లుగా మారాల్సిన పరిస్థితి, ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో ఉన్న అస్థిరతను స్పష్టంగా చూపిస్తోంది. రాబోయే రోజుల్లో ఉద్యోగ భద్రత, నైపుణ్యాల పెంపు (రీ-స్కిల్లింగ్), మరియు ఏఐ ప్రభావానికి తగిన విధంగా ఐటీ రంగం మార్పులు పొందడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య పోషణ పై అవగాహన






శామీర్ పేట, నవంబర్ 27( గరుడ వార్త) : గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆరోగ్య పోషణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శామీర్ పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్టలో ఆర్ వి ఎం సెంటర్ ఆధ్వర్యంలో యౌవన దశలో ఆరోగ్య పోషణపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాలలో అడోలెసెంట్ హెల్త్ ఇష్యూస్, న్యూట్రిషన్, హెల్త్ పై అవుట్‌రిచ్ మెడికల్ క్యాంప్ తో పాటు అవగాహన పరిచారు.

ఈ కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత మార్గదర్శకత్వంలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రమేష్ బాబు దంపురి పాల్గొని యౌవన దశలో ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులు, అనుసరించవలసిన పరిశుభ్రత, రుగ్మతల నివారణ చర్యలు, పోషకాహారం, సమతుల ఆహారం, అనీమియా నియంత్రణ వంటి కీలక అంశాలను విద్యార్థులకు వివరిస్తూ విలువైన సూచనలు చేశారు. అనంతరం హెల్త్ సూపర్వైజర్ డాక్టర్ భాగ్యలక్ష్మి విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత ఉపయోగకరమైన మార్గదర్శకాలు అందించారు.

యౌవన దశలో పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, సమతుల ఆహారం ప్రాముఖ్యత, మానసిక, శారీరక శ్రేయస్సు వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మేఘ స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అధ్యాపకులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## పొలాల్లోని వరి కొయ్యలను కాల్చకుండా ఎరువుగా మార్చుకోవాలి : వ్యవసాయాధికారి రవికుమార్

శామీర్ పేట, నవంబర్ 27( గరుడ వార్త): పొలాల్లోని వరి కొయ్యలను కాల్చకుండా ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వరి కోతల అనంతరం రైతులు గడ్డిని తగలబెట్టడంతో అనేక నష్టాలు కలుగుతాయని చెప్పారు. పంట కోసిన తర్వాత పొలాల్లో మిగిలిన వరి గడ్డిని త్వరగా తొలగించుకోవడానికి తగల పెడుతుంటారని, ఈ పద్ధతి తో నేలకి, పంటకి, మన ఆరోగ్యానికి ఎంతో నష్టం జరుగుతుందన్నారు. వరి కొయ్యలను తగలబెట్టడంతో నేలలోని జీవాలను నాశనం చేస్తాయని చెప్పారు. వరి గడ్డి తగలబెట్టినప్పుడు ఉష్ణోగ్రత 300%-700%శీసి వరకు పెరుగుతుందని, ఈ తీవ్ర వేడి వలన నేలలో సహజంగా ఉన్న నత్రజని కలిపే సూక్ష్మజీవులు,నేలకు పుష్టి తెచ్చే బ్యాక్టీరియా, కార్బన్ నిల్వ చేసే జీవాలు నాశనం అవుతాయని తెలిపారు. ఇవి పంట పెరుగుదలకి ప్రధాన ఆధారమని, ఇవి నశిస్తే నేల బలహీనమై పండించే శక్తి తగ్గిపోతుందన్నారు. వరి గడ్డిలో సహజంగా ఉండే నత్రజని, ఫాస్పరస్, పొటాష్, కార్బన్ వంటి ముఖ్యమైన పోషకాలు నేలకు తిరిగి చేరతాయని, వరి కోయ్యలను తగలబెట్టే సమయంలో ఇవన్నీ పొగ రూపంలో ఎగిరిపోతాయని తెలిపారు. దీంతో నేలలో సేంద్రియ పదార్థం తగ్గి, నేల నీరు పట్టే శక్తి, తడి నిల్వ సామర్థ్యం బలహీన మవుతుందన్నారు. ఇది తర్వాతి పంటల్లో దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణం అవుతుందని చెప్పారు. వరి కొయ్యలను తగల బెట్టినప్పుడు వాయువుల్లోకి సిఓ2,సి ఓ, పి ఎం 2.5 లాంటి హానికర కణాలు వెళ్తాయని తెలిపారు. ఇవి శ్వాసకోశ సమస్యలు, పిల్లలు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు, వాతావరణ కాలుష్యం కలిగిస్తాయన్నారు. అదనంగా గ్రీన్ హౌస్ వాయువులు పెరిగి వాతావరణ మార్పులకు దోహదం చేస్తాయని చెప్పారు. వరి గడ్డిలో ఒక్క టన్ను గడ్డికి సుమారు 6 కిలోల నత్రజని,1.5 కిలోల ఫాస్పరస్,10 నుంచి12 కిలోల పొటాష్ ఉంటాయని, ఇవన్నీ పంటకు చాలా విలువైనవని, గడ్డి తగలబెట్టడం అంటే ఈ పోషకాలను మొత్తంగా నష్టపోవడమే అన్నారు. అందువల్ల తర్వాతి పంటకు ఎక్కువ ఎరువుల కొనుగోలు అవసరం అవుతుందని, రైతులకు ఖర్చు పెరుగుతుందని తెలిపారు. వరి కొయ్యలు తగలబెట్టడంతో నేలపై ఉన్న సేంద్రియ పొర పూర్తిగా కాలిపోతుందని, దీని వల్ల నేల కఠినం అవుతుందన్నారు. వేళ్ల లోపలికి వెళ్ళడానికి ఇబ్బంది పడతాయని, పంట పెరుగుదల మందగించి దిగుబడి తగ్గిపోతుందని చెప్పారు.

గడ్డి తగలబెట్టడం తో పొలం త్వరగా శుభ్రం అవుతుంది తప్ప దీని వల్ల కలిగే నష్టం కొన్ని సంవత్సరా లు కొనసాగుతు నేల బలం తగ్గుతోందని తెలిపారు. వరి కొయ్యలను తగలబెట్టకుండా పొలంలో కలిపి పచ్చి ఎరువుగా వాడటంతో నేలకి సహజంగా కార్బన్, పోషకాలు తిరిగి చేరి నేల బలంగా మారుతుంద న్నారు. మల్చర్, హ్యాపీ సీడర్ ఉపయోగించడం, గడ్డిని చిన్న తరగులుగా చేసి నేలమీద పరచవచ్చని, ఇది పోషకాలను పెంచడమే కాకుండా తడి ఎక్కువ రోజులు నిల్వ చేస్తుందని చెప్పారు. గడ్డిని తగలబెట్టకుండా గోశాలలకు పశుగ్రాసంగా ఇవ్వడంతో రైతుకు అదనపు ఆదాయం వస్తుందని, బయోగ్యాస్, బయోచార్ చేయించడం వల్ల వ్యవసాయానికి తిరిగి ఉపయోగపడే మంచి ఎరువు, ఇంధనం అందిస్తుందన్నారు. వరి గడ్డిని తగలబెట్టకుండా, నేలకు మేలు చేసే మార్గాలను అనుసరిం చడం అత్యంత అవసరమని, ఇది రైతుకు, పంటకు, ప్రకృతికి కలిసొచ్చే మార్గమని సూచించారు.




అమరావతి: దేవతల రాజధాని ఎలా ఉంటుందో.. అదే నమూనాతో ఏపీ రాజధాని అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. రాజధాని కోసం రైతులు 33వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని, పవిత్ర కార్యక్రమానికి రైతులు సహకరించారని అభినందించారు. అమరావతిలోని వెంకటపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం చంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. రూ.260 కోట్లతో రెండు దశల్లో పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాకారం, మహారాజగోపురం, ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించనున్నారు. మాడవీధులు, అన్నదాన కాంప్లెక్స్ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. మొదటి దశలో రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మిస్తారు. రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, వాహన మండపం, రథ మండపం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. రెండో దశలో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్‌రోడ్డు, అన్నదానం కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనుల్ని చేపడతారు. వీటికి



రూ.120 కోట్ల వ్యయం కానుంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం శ్రీవారి ఆలయాన్ని రూ.185 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. దానిని రూ.36 కోట్లకు కుదించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి.. ఆలయాన్ని 2014-19 నాటి ప్రణాళికను మించి సకల హంగులతో అభివృద్ధి చేసేందుకు అడుగు ముందుకేసింది.

## కళాశాలను బతికిస్తున్నారు

మల్యాల: మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య 150. ఇందులో తరగతులకు హాజరయ్యేది మాత్రం 50 మందే. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 105 మంది, రెండో సంవత్సరంలో 115 మంది చదువుతున్నారు. ఈ మార్పు వెనక అధ్యాపకులు, ప్రిన్సిపల్ సమష్టి కృషి ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, వారు నిత్యం కళాశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు నాణ్యమైన బోధన ఇందుకు దోహదపడింది.

**ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ**

దృశ్య, శ్రవణ విధానంలో బోధిస్తే చాలా కాలం గుర్తుండిపోతుందన్న ఆలోచనతో ప్రిన్సిపల్ శివరామకృష్ణ సొంత డబ్బుతో ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. యానిమేషన్ వీడియోలతో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో అధ్యాపకుడు 15-20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి రోజూ కళాశాలకు హాజరయ్యేలా చూస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరు, చదువులో పురోగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంటారు.

తల్లిదండ్రులు లేని, పేద విద్యార్థుల చదువుకు మలబార్ గోల్డ్ సంస్థ అందించే ఆర్థిక సాయం కోసం అధ్యాపకులే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. కళాశాల నుంచి రెండేళ్ల కిందట 42 మంది, గతేడాది



28 మంది విద్యార్థులు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం పొందారు. ఈ సంవత్సరం 32 మంది దరఖాస్తు చేశారు.

వార్షిక పరీక్షల సమయంలో దాతల సాయంతో కళాశాలలో మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల రవాణా ఖర్చులను అధ్యాపకులే సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు కిచిడీ అందించడానికి ముడి సామగ్రి సమకూర్చడానికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ముందుకొచ్చారు.

పేరెంట్ టీచర్ సమావేశానికి అధ్యాపకులు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు.

పాఠాలు గుర్తుండిపోతున్నాయి

ప్రొజెక్టర్ సాయంతో యానిమేషన్ వీడియోల ద్వారా బోధించే పాఠాలు గుర్తుండిపోతున్నాయి. అధ్యాపకులు వివిధ రకాల బోధనా సామగ్రిని మాతోనే తయారు చేయించడంతో సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతోంది. అధ్యాపకుల ఆర్థిక సాయంతో బల్వంతాపూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని కళాశాలకు వస్తున్నా.

గంగాభవాని, బైపీసీ రెండో సంవత్సరం

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ

ఒక్కో అధ్యాపకుడు 15 నుంచి 20 మంది చొప్పున దత్తత తీసుకున్నాం. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం. కళాశాల జనావాసాలకు దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్తుంటే సమయం వృథా అవుతోంది. సత్యసాయి సేవాట్రస్టు నిర్వాహకులు కిచిడీ అందించడానికి ముందుకొచ్చారు. ఇటీవల మంజూరైన రూ.16 లక్షలతో అవసరమైన వసతులు కల్పిస్తాం.

శివరామకృష్ణ, ప్రిన్సిపల్

## ఆటలకు చోటేది.. పోటీలకు నిధులేవి?

జగిత్యాల : 'క్రీడల అభివృద్ధే లక్ష్యం, క్రీడలతోనే ఆరోగ్యం' ఇవన్నీ వివిధ వేదికలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మైదానాలు, క్రీడా సామగ్రి అంతంతే. నిధుల కేటాయింపు అలసత్వంతో ఆటలకంటూ ఓ పీరియడ్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు మరచిపోతున్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. చాలామందికి క్రీడల్లో ప్రవేశం లేకుండానే విద్యార్థి దశ ముగు స్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం కల్పించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని క్రీడాకారులు అభ్యర్థిస్తున్నారు.

**బాలబాలికల విభాగాల్లో..**

ఉమ్మడి జిల్లాలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, హ్యాండ్‌బాల్, నెట్బాల్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్, అథ్లెటిక్స్ తదితర పోటీలపై ఆసక్తి ఉంది. దీంతో 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో కథలాపూర్, మెట్పల్లిలో ఖోఖో.. లక్ష్మీపూర్‌లో బాస్కెట్బాల్ పోటీలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. ఆసక్తి, ప్రాధాన్యత, ప్రాచుర్యం తదితర పరిస్థితులకనుగుణంగా మండలాలను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన చదరంగం, టెండికాయిట్, బ్యాడ్మింటన్, ఈత



తదితర క్రీడలకు పెద్దగా పోటీ లేకపోవడంతో ఎంపికలతోనే సరిపెడుతున్నారు. మొత్తం 50 వరకు క్రీడాంశాలుండగా.. ఉమ్మడి జిల్లాలో పోటీలు, ఎంపికలు చేపట్టే క్రీడల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టే పరిస్థితులుండటం గమనార్హం.

**దాతలు ముందుకొస్తేనే నిర్వహణ**

జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నిధులు మంజూరవుతుండగా,.. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పైసా లేకుండా పోతుంది. వీటి నిర్వహణకు రూ.వేలల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో దాతలపై ఆధారపడటం తప్పనిసరిగా మారింది.

ఇటీవల కథలాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి 14, 17 ఏళ్లలోపు విభాగంలో బాల, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తే ఒక్కో విభాగంలో నాలుగు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. 192 మంది క్రీడాకారులు, న్యాయ నిర్ణేతలు, పీడీలు, పీఈటీలు, నిర్వాహకులు కలిపి మొత్తం 250 మందికి భోజనం ఖర్చు రూ.20 వేలు అయింది. సమ దుస్తులు ఒక్కో దానికి రూ.300 చొప్పున రూ.60 వేలు, బహుమతులకు మరో రూ.5 వేలు, నిర్వహణ కోసం టెంట్లు, మైక్, తాగునీరు తదితరాలకు రూ.10 వేలు కలిపి సుమారు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది.

# ఆమ్యామ్యాల పర్వం.. వాటాలే సర్వం!

హైదరాబాద్: ఓ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక విభాగంలో కొందరు ఇన్‌స్పెక్టర్లు.. వారి పై అధికారి వసూళ్ల బాగోతం చర్చనీయాంశంగా మారుతోంది. సైబర్ మోసాల్లో కోల్పోయిన డబ్బు ఇప్పించాలంటూ బాధితులు కాళ్లరిగేలా స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే.. వారు మాత్రం అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతూ నిందితులకు సహకరిస్తున్న వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అంతర్గతంగా విచారిస్తున్నట్లు తెలిసింది.

**కేసుల పేరుతో బెదిరించి వసూళ్లు..**

సాధారణంగా సైబర్ మోసగాళ్లు ఎక్కువ సంఖ్యలో బ్యాంకు ఖాతాలను ఉపయోగిస్తారు. కొట్టేసిన డబ్బును ఎక్కువ ఖాతాలకు మళ్లించి చివరకు వ్యాపారులకు కమీషన్ ఇచ్చి నగదు తీసుకుంటుంటారు. బాధితులు 1930కి ఫోన్ చేసినప్పుడు ఐఫోర్‌సీ(ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) ద్వారా తొలుత నిందితుడి బ్యాంకు ఖాతాల్ని స్తంభింపజేస్తారు. ఆ తర్వాత నిందితుడు ఏయే ఖాతాలకు డబ్బు మళ్లించారో గుర్తించి వాటిని కూడా ఫ్రీజ్ చేయిస్తారు. నేరగాళ్ల ఆచూకీ గుర్తించి.. వారిని



అరెస్టు చేస్తారు. ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్లు.. వారి పై అధికారి ఇలా ఫ్రీజ్ చేయించే విధానాన్ని అనుకూలంగా మార్చుకున్నారు. సదరు వ్యాపారుల ఖాతాల్లో.. నేరగాళ్లు బదిలీ చేసిన సొమ్ముతోపాటు ఇతర లావాదేవీల డబ్బు ఉంటుంది. బ్యాంకును సంప్రదిస్తే ఫలానా కేసులో పోలీసులు స్తంభింపజేసినట్లు చెబుతారు. దీంతో వ్యాపారులు పోలీసుల్ని సంప్రదిస్తారు. ఈ క్రమంలోనే కొందరు ఇన్‌స్పెక్టర్లు ఆమ్యామ్యాలకు తెరలేపుతున్నారు. బ్యాంకు ఖాతాను అన్‌ఫ్రీజ్ చేయించడానికి కమీషన్ మాట్లాడుకుంటున్నారు.

**ఒక్కో కేసు.. రూ.లక్షల్లో..**

ఖాతాలు అన్‌ఫ్రీజ్ చేయించేందుకు రూ.లక్షల్లో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సదరు కమిషనరేట్ పరిధిలోని ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో జరిగిన మోసంలో రూ.లక్షల్లో పోగొట్టుకున్నాడు. కేసులో ఓ ఇన్‌స్పెక్టర్.. నిందితుడి నుంచి రూ.5 లక్షలు వసూలు చేసి అతడి ఖాతాను అన్‌ఫ్రీజ్ చేయించినట్లు సమాచారం. మరో ఇన్‌స్పెక్టర్ రూ.10 లక్షలు తీసుకున్నారనే ఆరోపణ ఉంది. మరికొందరు ఇన్‌స్పెక్టర్లు రూ.లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో ఒక అధికారికి దంచనుగా వాటాలు వెళున్నట్లు.. ఆయనకు తెలిసే అంతా జరుగుతోందని సిబ్బంది చెబుతున్నారు. అంతేకాక నెలకు రూ.2 లక్షలు ఇవ్వాలంటూ ఇన్‌స్పెక్టర్లకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

# యువతా.. మీరే మేలుకోవాలి

ఖమ్మం : వారి శాఖ పేరులో 'శ్రమ' ఉన్నా తీరులో అదెక్కడా కనిపించదు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత ఉపాధి కల్పనకు దోహదపడే సదవకాశం చేతుల్లో ఉన్నా, చేతల్లో ఎంతమాత్రం చూపటంలేదు. విద్యార్థులు, ఉపాధి దారులు వెతుక్కోవటంలో సోదర శాఖలు అంతోఇంతో తపన పడుతున్నా, ఆ తాపత్రయే జిల్లా పరిశ్రమల శాఖలో కనిపించటం లేదు. దాదాపు ఏడాది వ్యవధిలో డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) పథకం ద్వారా కేవలం ఇద్దరికే ఉద్యోగాలు చూపగలిగారంటే పనితీరు అర్థం చేసుకోవచ్చు.

**ఏమిటీ డీఈఈటీ**

నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2024, డిసెంబరు నెలలో డీఈఈటీ పేరుతో వెబ్‌సైట్ ఆవిష్కరించింది. 2019లో ఓ ప్రైవేటు సంస్థ నుంచి ఈ వెబ్‌సైట్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. పరిశ్రమల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నైపుణ్యవంతులైన నిరక్షరాస్యులు మొదలు పీజీ, పీహెచ్‌డీ విద్యార్హత కలిగిన వారందరూ దరఖాస్తుకు అర్హులే. మొత్తంగా జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, పరిశ్రమలకు మధ్య వారధిలా వెబ్‌సైట్ పనిచేయాలి. క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**పరిశ్రమల శాఖ ఏం చేయాలి?**

1. యాప్‌పై విద్యార్థుల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర కాలేజీల్లో సదస్సులు ఏర్పాటు చేయాలి. రిజిస్ట్రేషన్ నమోదులో సహకరించాలి.

2. జిల్లాలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు డీఈఈటీ గూటికిందకు వచ్చేలా చూడాలి. ఖాళీలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా ప్రోత్సహించాలి. 3. ఖాళీల సమాచారాన్ని యువతకు చేరవేసి, ఉద్యోగ కల్పనకు సహకరించాలి.

4. జిల్లా ఉపాధి కల్పన, కార్మిక శాఖలతో కలిసి విస్తృత ప్రచారం చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను భాగస్వామ్యం చేయాలి.

**ఏం చేశారు?**

కలెక్టర్ చేతుల మీదుగా ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులతో కేవలం ఒకటే సమావేశం నిర్వహించి మిన్నకున్నారు. నిర్దేశిత అర్హతలు పరిగణలోకి తీసుకున్నా జిల్లాఓ ఇంకా చాలా పరిశ్రమలు పేర్లు నమోదు చేసుకోలేదు. వారితో సమావేశాలు నిర్వహించి, ప్రోత్సహించే ప్రయత్నమే కరవైంది.

పది నెలలు దాటినా రెండే కొలువులు చూపగలిగారు. సమాచారం చేరవేయటం అటుంచి ఈ వైఫల్యంపై సమీక్షించుకున్న దాఖలాలే లేవు. వెబ్‌సైట్‌ను నిరుద్యోగ యువత, విద్యార్థుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నమే లేదు. జనరల్ మేనేజర్ పోస్టు ఇన్‌ఛార్జి బాధ్యతలు కావటం, కిందిస్థాయి ఉద్యోగులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవటంతో ఆసక్తి కరవైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా మార్గదర్శకం కరవైంది.

'విద్యా సంస్థలతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించాం. విద్యా సంస్థలకు వెళ్లి సదస్సులు నిర్వహించాలన్నా, విస్తృత ప్రచారం చేయాలన్నా నిధులలేమి ఆటంకంగా మారింది.'

జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు

జిల్లాలో డీఈఈటీ వెబ్‌సైట్‌లో నమోదైన నిరుద్యోగులు: 5,866

నమోదైన పరిశ్రమలు: 33

ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగాలు: 2

ప్రస్తుతం ఉద్యోగ ఖాళీలు: 50

# మంచూరు 10,341.. పూర్తయినవి11



సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లా వ్యాప్తంగా నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో పురోగతి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న క్షేత్రస్థాయిలో కదలిక లేదు. సకాలంలో ఇసుక, ఇటుక దొరకకపోవటం.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితుల వల్ల నిర్మాణాల్లో వేగం లోపించింది. అధికారులు అవగాహన కల్పించినా అంతంత మాత్రంగానే నిర్మాణాలు సాగుతున్నాయి. మంజూరులో సగం ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

**7,736 ప్రారంభం**

జిల్లాలో 10,341 ఇళ్లు మంజూరయ్యాయి. కథలాపూర్ మండలంలో మూడు, మల్యాల, ధర్మపురి, పెగడపల్లి, జగిత్యాల రూరల్, జగిత్యాల, మల్లాపూర్, రాయికల్, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పూర్తయ్యాయి. మొత్తం 7,736 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. 3016 బేస్‌మెంట్ లెవల్, 1214 లెంటల్ లెవల్, 1119 స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేసుకున్నాయి. అంతక ముందు మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినా.. పనులు ముందుకు సాగటం లేదు. బేస్‌మెంట్ వరకు పూర్తి చేసుకున్న తర్వాత రూ.లక్ష, లెంటల్ లెవల్ వరకు మరో రూ.లక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, ఇల్లు పూర్తయిన తరువాత రూ.లక్ష ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే ప్రతి సోమవారం ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నారు.

**గ్రామాల్లో ఇసుక, ఇటుక కొరత**

నిర్మాణాలకు ప్రధానంగా ఇసుక, ఇటుక కొరత కారణంగా ఆలస్యమవుతుందని అధికారులు, లబ్ధిదారులు పేర్కొంటున్నారు. దీనిని ఆసరా చేసుకుని ధరలు కూడా విపరీతంగా పెంచారు. ఇటుక తయారీ జిల్లాలో ఎక్కువగా లేకపోవటం, ఇటీవల కురిసిన వర్షాలకు ఉన్నది పాడవ్వటంతో కొరత ఏర్పడింది. గ్రామాల్లో ఇసుక ధరకు రెక్కలు వచ్చాయి. గోదావరి నుంచి అక్రమంగా తరలించేవారు రేట్లు పెంచుతున్నారు.

**స్వశక్తి సంఘాల ద్వారా రుణాలు**


గ్రామాల్లో లబ్ధిదారుల అవసరం మేరకు రుణాలు అందించేందుకు సెర్ప్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్వశక్తి సంఘంలో ఉండి.. ఇందిరమ్మ లబ్ధిదారులయితే రూ.లక్ష వరకు ప్రత్యేక రుణం అందించనున్నారు. ప్రభుత్వం మహిళల పేరిట ఇల్లు మంజూరు చేస్తుండగా.. దాదాపు గ్రామాల్లో మహిళలందరూ స్వశక్తి సభ్యులుగా ఉన్నారు. ప్రతి మహిళా లబ్ధిదారురాలికి రుణం అందించేలా సెర్ప్ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు రూ.2కోట్ల వరకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించారు. కిస్తీ ప్రతినెల చెల్లించాల్సి ఉండగా, పొదుపు సంఘం తీర్మానం మేరకు రుణం అందించాలి.

**సామగ్రి వినియోగం ఎక్కువ**

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితేనే బిల్లుల చెల్లింపు సాధ్యమవుతోంది. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకోవచ్చు. సామగ్రి వినియోగం ఎక్కువ కావటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. తక్కువ పెట్టుబడితో నిర్మాణాలు చేపట్టుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

–వాసం ప్రసాద్, డీఈఈ, గృహనిర్మాణ శాఖ

# విస్తరిస్తున్న మధుమేహం



గోదావరిఖని : అహారపు అలవాట్లు.. శారీరక శ్రమ లేకపోవడంతో 30 ఏళ్ల వారిలో మధుమేహ లక్షణాలు వెలుగు చూస్తున్నాయి. వైద్యారోగ్యశాఖ సర్వేలో జిల్లాలో ఒక్క ఏడాదిలోనే 4,497 మంది బాధితులను గుర్తించారు. గతేడాది కంటే బాధితులు పెరగడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. తీసుకునే ఆహారంలో నియంత్రణ లేకపోవడంతో పాటు కనీస శ్రమ చేయకపోవడం మధుమేహానికి కారణంగా వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ప్రైవేటు రోగనిర్ధారణ కేంద్రాల్లో పరీక్షలు చేసుకునే వారి సంఖ్య లెక్కల్లోకి రావడం లేదు.

**జీవనశైలిలో మార్పు రావాలి**

మధుమేహం రాకుండా చూడటం మన చేతుల్లోనే ఉంటుంది. ఫిన్‌ల్యాండ్, డెన్మార్క్, నార్వే లాంటి దేశాల్లో ఎక్కువ శాతం సైకిల్‌పైనే ప్రయాణిస్తారు. అక్కడి ప్రభుత్వాలు దీన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఇక్కడ నడిచే వారిని చిన్నచూపు చూస్తారు. ఇంట్లో పనిని మనమే చేసుకోవాలి. శారీరక శ్రమ తప్పనిసరి. రైస్ తక్కువగా తీసుకోవాలి. వీటిని జీవనశైలిలో అలవర్చుకోవాలి.

– అశోక్, ఫిజీషియన్, ఖని ప్రభుత్వ ఆస్పత్రి

**ఇవి పాటించాలి**

తాజా పండ్లు తీసుకోవాలి

ఆకుకూరలు, తృణధాన్యాలు

తక్కువ కేలరీలు ఉన్న ఆహారాన్ని ఎంచుకోవాలి

కనీసం రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయాలి

గుర్తించడం ఇలా

ఎక్కువ సార్లు మూత్రానికి వెళ్లడం

తొందరగా అలసిపోవడం

ఊహించని విధంగా బరువు తగ్గడం

వీటిపై ప్రభావం

మూత్రపిండాలు. గుండె, నేత్రాలు, నరాలు

జీర్ణాశయం, రక్తప్రసరణ వ్యవస్థ

# ఏళ్లుగా కన్నీళ్లు ..ఇళ్లను చేరుతున్న నీళ్లు



ధర్మారం : నందిమేడారం రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం అయిదింతలు పెంచిన నీటిపారుదలశాఖ.. ముంపునకు గురయ్యే ఇళ్లకు మాత్రం పరిహారం చెల్లింపు లెక్కలు తేల్చలేదు. వర్షాకాలంలో వరదకు జలాశయంలో నీటిమట్టం పెరిగి ఇళ్లను చేరుతుంది. ఈ నీటిని దిగువకు వదిలే వీలు లేకపోవడంతో గాయత్రి పంపుహౌస్‌లో మోటార్లను ఆన్ చేసి వరద కాలువలోకి ఎత్తిపోస్తూ రిజర్వాయర్‌ను ఖాళీ చేస్తున్నారు. చామనపల్లిలో ముంపునకు గురయ్యే ఇళ్లను మాత్రమే సేకరిస్తే జలాశయంలో నీటి మట్టం కారణంగా మిగిలిన గ్రామంలోకి క్రిమి కీటకాలు చేరతాయని గ్రామాన్నంతా ముంపుగా ప్రకటించి పరిహారం ఇవ్వాలని 13 ఏళ్ల కిందట నీటిపారుదల, రెవెన్యూ అధికారుల ఎదుట గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అప్పట్నుంచి సమస్య పెండింగ్‌లో ఉంది. 2021 ఆగస్టులో చేసిన ప్రాథమిక సర్వే ప్రకారం 490 ఇళ్లు ముంపునకు గురవనున్నట్లు గుర్తించారు.

**బావుల్లో పచ్చగా నీరు**

ఇళ్ల సమీపం వరకు నీళ్లుండగా భరించలేదని దుర్వాసన వస్తోంది. దురద, చర్మ వ్యాధులతో బాధపడుతున్నాం. చేద బావుల్లో నీళ్లు పచ్చగా మారాయి. మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకుల్లో నిండా నీళ్లే. ఇలా అయితే ఎలా బతకాలి. – సిరికొండ రవి

**పాముల భయం.. అనారోగ్యం**

ముంపులో నాలుగెకరాల పొలం పోయింది. చేద్దామంటే పని లేదు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. రోజూ పాముల భయమే. భూములను తీసుకుని ఇళ్లను వదిలేశారు. వర్షాలు కురిసినప్పుడు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం. – బెజుగం లచ్చయ్య

శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి

ముంపునకు గురయ్యే ఇళ్లకు పరిహారం ఇవ్వకుండానే రిజర్వాయరు సామర్థ్యం పెంచి గత ప్రభుత్వం చామనపల్లి ప్రజలకు అన్యాయం చేసింది. నీటిపారుదలశాఖ మంత్రి, ఆ శాఖ అధికారులతో పెండింగ్ పనులపై సమీక్ష సమావేశం కొద్దిరోజుల్లో ఏర్పాటు చేసుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కావాల్సిన నిధులను సాధిస్తాను.

# తేలిన రిజర్వేషన్లు.. సందడి షురూ

వికారాబాద్: సెప్టెంబరులో విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్‌లో ధారూర్ మండలంలోని ఓ పంచాయతీని బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో ఆ గ్రామంలో ప్రధాన పార్టీల తరఫున ఇద్దరు ఆశావహులు ప్రజల మద్దతు పొందేందుకు పోటీపడ్డారు. ఇదే సమయంలో దసరా పండుగ రావడంతో విందులు ఏర్పాటు చేసి చేతి చమురు వదిలించుకున్నారు. ప్రస్తుత రిజర్వేషన్లలో ఆ పంచాయతీ జనరల్‌గా మారింది. దీంతో జనరల్ కేటగిరీకి చెందిన ఇద్దరు ప్రధాన పార్టీల నుంచి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఇదివరకే పదవిని ఆశించి ఖర్చు చేసిన డబ్బులు ఇచ్చి పోటీలో నిలువాలని, లేకుంటే మద్దతు ఇచ్చేది లేదని సదరు బీసీ అభ్యర్థి పేచీ పెడుతున్నాడు. నామపత్రాలు దాఖలు చేసే నాటికి డబ్బులు ఇస్తానన్న హామీతో సమస్య



సద్దుమణిగింది. ఇదే పరిస్థితి బీసీ రిజర్వేషన్లు మారిన గ్రామాల్లో నెలకొంది. గత షెడ్యూల్ ప్రకారం: సెప్టెంబరులో వెలువరించిన ఎన్నికల షెడ్యూల్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించారు. దీంతో జిల్లాలోని 594 పంచాయతీల్లో 249 బీసీలకు కేటాయించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన పార్టీల తరఫున ఆశావహులు మద్దతు కూడగట్టుకునే పనిలో తలమునకలయ్యారు. సర్పంచిగా పోటీ చేసి విజయం సాధించేందుకు అవసరమైన ప్రయత్నాలు చేశారు. కోర్టు స్టే విధించడంతో బీసీ రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22కు తగ్గించారు. దీంతో 20 శాతం స్థానాలు కోల్పోయి. కేవలం 107కే పరిమితం అయ్యాయి.

**బీసీలకు తక్కువ స్థానాలు**వంద శాతం ఎస్టీలు ఉన్న పంచాయతీలు జిల్లాలో 92 ఉండగా, వీటిని మినహాయించి రిజర్వేషన్లు ఖరారు చేయడంతో బీసీలకు 107, ఎస్సీలకు 111, ఎస్టీలకు 119 స్థానాలు దక్కాయి. బీసీల కంటే ఎస్సీ, ఎస్టీలకే ఎక్కువ రిజర్వేషన్లు దక్కడంతో ఆ వర్గాలు నిరాశకు గురవుతున్నాయి. జిల్లాలో పార్టీలకు అతీతంగా బీసీల ఐకాసకు అంకురార్పణ చేశారు. బీసీ వాదాన్ని కేంద్రానికి బలంగా వినిపించేలా మరో తెలంగాణ స్థాయిలో ఉద్యమించేందుకు కార్యాచరణ రూపొం దిస్తున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# ఆగని దందా.. అడ్డుకునేది లేదా!

జమ్మికుంట: మానేరు పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక రవాణా దందా జోరుగా సాగుతోంది. ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు పెడితే, విడిపించుకునేందుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అక్రమార్కులు ఖర్చు పెడుతున్నట్లు తెలిసింది. ఈ దందాలో అధిక శాతం యువకులే ఉంటున్నారు. జమ్మికుంట పరిధిలోని మానేరు పరివాహక ప్రాంతంలో రీచ్ ఏర్పాటు చేస్తే అక్రమ రవాణాకు తెరపడే అవకాశముంది.

**వందల ట్రాక్టర్లలో రవాణా..**

జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, హుజూరాబాద్ పరిధిలోని మానేరు పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను రోజూ వందల ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. వీణవంక మండలం కొండపాక, పోతిరెడ్డిపల్లి మానేరు ప్రాంతం నుంచి ఒకేసారి తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. జమ్మికుంట ప్రాంతంలో ప్రభుత్వ పరంగా రీచ్‌లు లేకపోవడంతో పలు నిర్మాణాలకు అక్రమార్కుల వద్ద కొనుగోలు చేస్తున్నారు.

**డిమాండ్ ప్రకారం ధర..**

జమ్మికుంట పరిసర ప్రాంతాలకు ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.3,500.. హనుమకొండ, వరంగల్‌కు రూ.7 వేల నుంచి రూ.8 వేల దాకా డిమాండ్ ప్రకారం విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా నివారణకు ఉన్నతాధికారులు స్పందిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు పలు నిర్మాణాలకు కష్టాలు తీరుతాయి. ఇటీవల నమోదైన కేసులు

గత సెప్టెంబరు 18న జమ్మికుంట మండలం విలాసాగర్‌లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలో 18 ఇసుక లోడు ట్రాక్టర్లు, సరైన పత్రాలు లేని మరో 14 ట్రాక్టర్లను సీజ్ చేశారు.

జమ్మికుంట పరిధి వావిలాల గ్రామ సమీపంలో అక్టోబరు 26న లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. నల్గొండ జిల్లా షార్భాపురానికి చెందిన డ్రైవర్ వినయ్, యజమాని అశోక్, వీరికి సహకరించిన వావిలాలకు చెందిన సదానందం, జమ్మికుంటకు చెందిన మల్లేశ్‌పై కేసు నమోదు చేశారు.

పోలీసులు పట్టుకున్న 60 ట్రాక్టర్లు, మూడు టిప్పర్లు, 2 మినీ టిప్పర్ల ఇసుక నిల్వలను గత నెల 31న జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించగా.. ప్రభుత్వానికి రూ.4,25,000 ఆదాయం సమకూరింది.

# పొదుపు పాఠం.. ఉన్నతికి మార్గం

మిర్యాలగూడ : సమాజంలో వచ్చిన మార్పుల కారణంగా.. దిగువ మధ్య తరగతి ప్రజలు సైతం ఉన్నత వర్గాలతో సమానంగా జీవించాలని తహతహలాడుతున్నారు. తమ స్థాయికి మించి ఖర్చు చేస్తూ ఒక దశలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొదుపు అనగానే కేవలం డబ్బు మాత్రమే కాకుండా నీరు, విద్యుత్తు, ఇంధనం, మాటలు ఇలా ప్రతీది పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్తు ఆనందమయం అవుతుంది. పొదుపును ప్రోత్సహించేలా ఏటా అక్టోబరు 30న 'ప్రపంచ పొదుపు దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**ఇంధన ధరలు ప్రియం..**ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికి ద్విచక్ర వాహనంతో పాటు అనేక మందికి కార్లు ఉన్నాయి. చిన్నచిన్న దూరాలకు సైతం వాహనాల వాడకం పెరగడంతో ఇంధన వినియోగం విపరీతంగా పెరిగింది. దీంతో ఇంధన ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా డబ్బు ఆదాతో పాటు పర్యావరణాన్ని సైతం కాపాడిన వారవుతారు.

**పిల్లలకు అవగాహన కల్పించాలి..**

ఒక్కోసారి మనకు తెలియకుండానే అనవసరమైన వాటికి డబ్బును విపరీతంగా ఖర్చు చేస్తుంటాం. తమ సంపాదనలో కనీసం 30 శాతం భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేయాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. దీనిపై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి. తపాలా కార్యాలయంతో పాటు బ్యాంకుల్లో పలు పథకాలు అందుబాటులో ఉన్నాయి.

**ఆదాతోనే భవిత..**ఇటీవలి కాలంలో ఇళ్లతో పాటు వ్యవసాయం, వ్యాపార సంస్థలు, పరిశ్రమల కోసం విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. దీంతో డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు సాగిస్తున్నాయి. దీనిలో భాగంగానే దామరచర్ల మండలంలో యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తోంది.

# అ'విశ్రాంత' నిరీక్షణ

మేడిపల్లి మండలంలో అయిదు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు తనకు రూ.35 లక్షల వరకు ప్రయోజనాలు వస్తాయని భావించారు. కారు, గృహ రుణాలకు సంబంధించిన ఈఎంఐలను ఒకేసారి చెల్లించి కూతురు పెళ్లి చేద్దామని ప్రణాళికలు వేసుకున్నారు. ఇప్పటికీ ప్రయోజనాలు అందక, కొద్దిపాటి అప్పులు తీరక ఆవేదన చెందుతున్నారు.

కోరుట్లలో విద్యుత్తు శాఖలో పని చేస్తున్న ఉద్యోగి రెండు నెలల్లో విరమణ పొందనున్నారు. 20 నెలల కిందట ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇప్పటికీ ప్రయోజనాలు రావడం లేదనీ, తనకూ అలాగే అందవేమోనని దిగులు చెందుతున్నారు. రిటైర్మెంట్ అనంతరం కొన్నాళ్లపాటు అమెరికాలోని కుమారుడి వద్దకు వెళ్దామంటే రావాల్సిన ప్రయోజనాలు నిలిచిపోతాయేమోనన్న మీమాంసలో ఉన్నారు.

న్యూస్‌టుడే, మేడిపల్లి(జగిత్యాల): ఉద్యోగ విధుల నుంచి తప్పుకున్నాక వచ్చే ఆర్థిక ప్రయోజనాలు విశ్రాంత జీవనంలో ఆసరాగా నిలుస్తాయనుకుంటే నిరాశే మిగులుతోంది. వాటి కోసం ఎదురుచూసే వారి సంఖ్య పెరుగుతోంది. పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాల కోసం చేతికందాల్సిన సొమ్ము అందక విశ్రాంత ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. వయో పరిమితి పెంపుతో రాష్ట్రంలో 2021 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉద్యోగ విరమణలు ఆగిపోయాయి. తిరిగి ప్రారంభమయ్యాక గత 19 నెలల్లో జగిత్యాల జిల్లాలో 672 మంది ఉద్యోగ విరమణ పొందారు. రోజుకు సరాసరి ఒకరు చొప్పున రిటైర్ అవుతున్నారు. వీరిలో క్యాడర్‌ను బట్టి ఒక్కో విశ్రాంత ఉద్యోగికి రూ.30 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నగదు ప్రయోజనాలు అందాల్సి ఉంది. ఈ లెక్కన రూ.200 కోట్ల నుంచి రూ.530 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.



**న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్న బాధితులు**

ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వంతో చర్చలు జరిపిన నేపథ్యంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ డబ్బులు కొంత మొత్తంలో జమ చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపు కోసం కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నగదు రహిత వైద్య సేవలందడం లేదనీ, ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు రావడం లేదని విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

రావాల్సిన ప్రయోజనాలు (రూ.లక్షల్లో)
కమ్యూటేషన్: 7 నుంచి 15
జీపీఎఫ్: 10 నుంచి 12
గ్రాట్యుటీ: 10
ఫైనల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్: 3 నుంచి 5
ప్రభుత్వ జీవిత బీమా (టీజీఎల్ఐసి): 5
గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం (జీఐఎస్): రూ.20 వేలు

**17న కుటుంబాలతో మహాధర్నా**

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యమాలు చేసే దుస్థితి నెలకొంది. ఈ నెల 10లోగా విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనాలు అందించాలి. లేదంటే 17న ఉద్యోగుల కుటుంబసభ్యులతో కలసి మహాధర్నా నిర్వహిస్తాం. సొమ్ము సకాలంలో రాకపోవడంతో అప్పులు కట్టలేక, పెళ్లిళ్లు చేయలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. హరి అశోక్‌కుమార్, పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ కార్యదర్శి

## నాణ్యత లేమి.. తనిఖీలు మాని..!

భానుపురి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆహారశాలలపై తనిఖీలు నామమాత్రం అవుతున్నాయి. మరోవైపు వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించి రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ను కలుపుతున్నారు. శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఇది ప్రజారోగ్యం పాలిట శాపంగా మారుతోంది. ఇష్టమొచ్చినట్లు కల్తీ వ్యాపారం చేస్తున్నా ఆహార తనిఖీ విభాగం అధికారులు(ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు) పట్టించుకోవటం లేదు. వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఫిర్యాదు చేస్తేనే దాడులు..** ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 263 ఆహారశాలలపై దాడులు నిర్వహించారు. 52 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 133 ఆహారశాలలకు జరిమానా విధించా రు. అడపాదడపా తనిఖీలు చేపట్టడంతో ఆహారశాలల నిర్వాహకులు నాణ్యత పాటించడం లేదు. పుర అధికారులే ఎవరైనా ఫిర్యాదు చేసే వాటిపై దాడులు జరిపి జరిమానా విధిస్తున్నారు. కానీ ఆహార తనిఖీ విభాగం అధికారులు ఎవరూ తమకు తాము స్పందించడం లేదు. **వేధిస్తున్న ఖాళీలు** సిబ్బంది కొరత కారణంగా అధికారుల తనిఖీలు మొక్కుబడిగా మారాయి. జిల్లాకు ఇన్‌ఛార్జి అధికారులను నియమించడం వల్ల పనిభారంతో చర్యలు తీసుకొనే పరిస్థితి ఉండటం లేదు. వాస్తవానికి ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రతి నెలా ఆయా హోటళ్లు, దాబాలు, కిరాణా దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి 12 వరకు నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించాలి. కానీ ఉమ్మడి నల్గొండ జిల్లాలో అలా జరగటం లేదు. **కఠినంగా వ్యవహరిస్తాం**– జ్యోతిర్మయి, ఫుడ్ కంట్రోల్ అధికారిణి, నల్గొండ ఇక నుంచి ఉమ్మడి జిల్లాలో ఆహారశాలలపై తనిఖీలు ముమ్మరం చేస్తాం.

# కేసులు తేలట్లే.. దస్త్రాలు కనిపించట్లే!

హైదరాబాద్ : నగరంలో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ నుంచి.. కేసు దర్యాప్తు పూర్తిచేయటం పోలీసులకు సవాల్‌గా మారింది. మెగాసిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్లు పెంచారు. దానికి తగినట్టు సిబ్బందిని కేటాయించక పోవటంతో ఇబ్బందిగా మారింది. 700–800 మంది ఏఆర్ పోలీసులకు శిక్షణనిచ్చి శాంతిభద్రతల విభాగంలో కొనసాగిస్తున్నారు.

**బదిలీలతో సమస్య జటిలం**

ఉన్నతాధికారులు మారినప్పుడల్లా క్షేత్రస్థాయిలో సిబ్బంది బదిలీలతో సమస్య జటిలమవుతోంది. స్థానికంగా అవగాహన వచ్చి దర్యాప్తుపై దృష్టి సారించేలోపు స్థానచలనం తప్పట్లేదంటూ ఒక ఇన్‌స్పెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. పండగలు, ఉత్సవాలు, ఊరేగింపులు, ప్రముఖుల బందోబస్తులో సగకాలం పూర్తవుతుందని.. మిగిలిన సమయంలో కేసు పురోగతి పరిశీలించేలోపుగానే మరో బాధ్యతలు అప్పగించటమో, బదిలీపై వెళ్లటమో జరుగుతోంది. దాని ప్రభావం దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణపై పడుతోంది. తాజాగా నగరంలోని ఒక డీసీపీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ దస్త్రాలన్నీ చిందరవందరగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. వాటిలో పాత దస్త్రాలు ఎన్ని మాయమయ్యాయనేది గుర్తించటం కష్టమేనంటూ పోలీసు అధికారి ఆందోళన వెలిబుచ్చారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా సిబ్బంది లేకపోవటంతో ఒత్తిడి పెరుగుతోంది. అదనంగా 2–3వేల మందిని తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం.



# ఏ'మండీ'.. పట్టించుకోరు!



హైదరాబాద్ : రెండు దశాబ్దాల తర్వాత జియాగూడ కబేళా ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రభుత్వ నిధులతోనే ప్రాజెక్టును చేపట్టాలని ఏడు నెలల కిందట సర్కారు జీహెచ్ఎంసీని ఆదేశించింది. అప్పట్నుంచి కమిషనర్ కార్యాలయంలో దాదాపు పదిసార్లు కబేళా పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించగా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. నమూనా రూపొందించడం తమ వల్ల కాదంటూ సీనియర్ ఇంజినీర్లు చేతులెత్తేస్తున్నారు. టెండరు ప్రక్రియను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నారు.

**రోడ్డుపై నడవలేని దుస్థితి..** పురానాపూల్ వద్ద మూసీ నది ఒడ్డున సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో జియాగూడ మేకలమండీ ఉంది. మాంసం వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, కబేళా కార్మికులు, ఇతరత్రా కలిపి 5వేల మంది ఉపాధి పొందుతుంటారని అంచనా. నగరంలో ఉపయోగించే మాంసంలో 80శాతం జియాగూడ కబేళా నుంచి సరఫరా అయ్యేదే. క్రయ విక్రయాలతోపాటు జంతువులను పెద్దసంఖ్యలో వధించే కబేళా వల్ల.. మేకలమండీ దుర్వాసనతో నిండిపోతుంది. టన్నుల కొద్దీ మాంసం వ్యర్థాలు, చెత్త రోడ్లను ముంచెత్తుతుంది. మధ్యాహ్నం 12గంటల వరకు వ్యర్థాల తరలింపు జరుగుతూనే ఉంటుందని, అప్పటి వరకు..అటువైపు వెళ్లాలంటేనే.. భయపడాల్సిన పరిస్థితి.

**కమిషనర్ ఆగ్రహం..**

సీనియర్ ఇంజినీరు భాస్కర్‌రెడ్డి ముఖ్య ఇంజినీరుగా జీహెచ్ఎంసీలో సుమారు 20 మంది సీనియర్ ఇంజినీర్లతో ప్రాజెక్టుల విభాగం ఏర్పాటైంది. సీఎం ఏడాది కిందట శంకుస్థాపన చేసిన రూ.7వేల కోట్ల ప్రాజెక్టులు (పైవంతెనలు, రోడ్ల విస్తరణ), జియాగూడ కబేళా, ఇతరత్రా పనులన్నీ ఆయన పరిధిలోనే ఉన్నాయి. కానీ.. వాటిలో ఏ ఒక్క పనికూడా ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. జియాగూడ కబేళా పనులకు గత సర్కారు హయాంలోనే అభివృద్ధి ప్రణాళిక తయారైందని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా, కొత్త డిజైన్లను రూపొందించకుండా ఇంజినీర్లు కాలయాపన చేస్తున్నారనే విమర్శలున్నాయి. తాజాగా కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ఇంజినీర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వారం.. ప్రత్యేక పారిశుద్ధ్యం



పెద్దపల్లి : పల్లెలు సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. సీజనల్ వ్యాధుల కట్టడి, పరిసరాల పరిశుభ్రత పెంపు, ఆదాయ ఆర్జన వంటి అంశాలు మెరుగు పరిచేందుకు ఈ నెల 3 నుంచి 11 వరకు వారం రోజులు అధికారులు పల్లెబాట పట్టనున్నారు. సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. ఈ విషయం పల్లెలకు కొంత ఊరటనిచ్చినప్పటికీ.. నిధులు కేటాయిస్తే మరింత ప్రయోజనం కలగనుంది. **నిధులపై ఆందోళన** గ్రామపంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిత్యం అమలుకు నిధుల సమస్య వెంటాడుతోంది. పాలకవర్గాలు లేకపోవడంతో మంజూరులో నిరాశే ఎదురవుతోంది. నెలల తరబడి ఈ సమస్య ఉండటంతో ప్రతి చిన్న పనికి దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు మరమ్మతు పనులు చేసినా నిధులు విడుదల కాలేదు. డీజిల్‌కు డబ్బులు లేక చాలా చోట్ల ట్రాక్టర్లు మూలనపడి ఉన్నాయి. ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే కార్యక్రమం లక్ష్యం ఫలిస్తోంది.

**రోజువారీ కార్యక్రమాలు ఇలా..**

ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి.. ట్రాక్టర్లలో డంపింగ్‌యార్డుకు తరలించటం. సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డు నిర్వహణ పరిశీలించనున్నారు. మాంసాహారం విక్రయించే దుకాణాలు నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించటం.

ఖాళీ స్థలాల్లోని ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగింపు.. స్వశానవాటిక శుభ్రం చేయటం.

మురుగు కాలువలు, పల్లె ప్రకృతి వనం, క్రీడామైదానాల్లో స్వచ్ఛత చర్యలు. తాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల్లో చనిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడం. శతశాతం ఇంటి పన్ను వసూళ్లకు కృషి చేయటం.. నెలాఖరులోపు ఆన్‌లైన్‌లో పొందుపరచటంపై అవగాహన కల్పించటం. **అన్ని రకాల పౌరసేవలు సకాలంలో పూర్తి చేయటం.** ఆన్‌లైన్‌లో లేని వాణిజ్య దుకాణాలకు నోటీసులు జారీ చేసి పునరుద్ధరించటం. 15లోపు లైసెన్స్ ఫీజులు ఆన్‌లైన్‌లో పొందుపరచటం. విద్యుత్తు సమస్యలను గుర్తించి.. సరిచేయటం. శిథిలావస్థ స్తంభాలను తొలగించటం. త్రీ ఫేజ్ సమస్యల పరిష్కారానికి కృషి.

# ఏమైంది.. యువ వికాసం..?

నల్గొండ : యువత స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరవైంది. దరఖాస్తులు సమర్పించి ఆరు నెలలు పూర్తవుతున్నా.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో యువతలో నిరుత్సాహం కనిపిస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాయితీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉండగా.. ఆఖరి క్షణంలో ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రాయితీ రుణాల పంపిణీపై సందిగ్ధత నెలకొనడంతో దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. యువ వికాసం పథకానికి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి మొత్తం 79,493 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీ రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించడంతో చాలా మంది రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్లకే ప్రాధాన్యమిచ్చారు. దరఖాస్తులను ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, రుణ బకాయిలను తనిఖీ చేసి ఇచ్చిన నివేదికలు, స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన జాబితా ఆధారంగా మండల, జిల్లా స్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపిక కసరత్తు చేశారు. ఎంపిక ప్రక్రియను నిలిపివేయాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో రుణాల మంజూరుకు బ్రేక్ పడింది. వచ్చిన దరఖాస్తుల్లో ముందుగా రూ.50 వేలు, రూ.లక్ష యూనిట్లను ఇచ్చేందుకు ప్రణాళిక చేశారు. ప్రారంభంలో వెయ్యి యూనిట్లను ఇచ్చేందుకు జాబితాను సిద్ధం చేశారు. తర్వాత ప్రభుత్వం వాయిదా వేయడంతో జాబితా పక్కన పెట్టారు. పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్ని కులాల నిరుద్యోగులు ప్రభుత్వం ఏం చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

# కలుషిత ముప్పు.. కలగాలి కనువిప్పు

సూర్యాపేట : ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండటంతో చలికాలం వానాకాలాన్ని తలపిస్తోంది. పొద్దున ఎండ, సాయంత్రం వర్షం కురవడం.. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో మిషన్ భగీరథ పథకంతో పాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాల్సి ఉంది. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలి. గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారన్న విమర్శలున్నాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ సంబంధిత సిబ్బందితో ఏటా నీటి నాణ్యత నిర్ధారణ



పరీక్షలు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలి.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. వివరాలు నమోదు చేయాలి.

ఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలి. మంచినీటిని సరఫరా చేసే పైపులకు లీకేజీ సమస్యలు ఉంటే తక్షణ మరమ్మతు చేపట్టాలి. ప్రతిరోజు క్లోరిన్ కిట్లద్వారా నీటి పరీక్షలు నిర్వహించాలి. నీరు కలుషితం కాకుండా చర్యలు

యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక రూపొందించి స్థానిక నీటి వనరుల్లో పరీక్షలు చేయడం, ట్యాంకులను శుభ్రం చేయించడం, క్లోరినేషన్ వంటి ప్రక్రియ చేపట్టనున్నాం. అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్, ఇతర రసాయాలను సిద్ధంగా ఉంచాం. పైపులైన్లకు లీకేజీ ఏర్పడిన వెంటనే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో మరమ్మతులు చేస్తున్నాం.

## శునకం వణికిస్తోంది..!

సూర్యాపేట : రోజురోజుకూ వీధి కుక్కలు పెరుగుతున్నా.. వాటి సంతతి నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడో ఒకచోట వీటి బారినపడి బాధితులు చికిత్స పొందుతూనే ఉన్నారు. వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టాలని రెండేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు నేటికీ సరైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో కుక్కకాటు బాధితులు ఏటా పెరుగుతున్నారు. శునకాల నియంత్రణ విషయంలో అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించక పోవడంతో నానాటికీ వీటి బారిన పడుతున్న వారు అధికమవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 32,168 మంది శునకాల బారిన పడి గాయాలపాలయ్యారు. ఎవరూ మృత్యువాత పడలేదు. ఈ లెక్కన చూసుకుంటే నల్గొండ జిల్లాలో రోజుకు 55 మంది, సూర్యాపేట–57, యాదాద్రి జిల్లాలో 4 చొప్పున గాయపడుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధులపై ఎక్కడో ఒకచోట వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లాలో అధికంగా బాధితులు ఉన్నారు. వీధి కుక్కల నియంత్రణ విషయంలో చర్యలు చేపట్టాలని కోర్టులు ఆదేశాలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల అమలు కావడం లేదు.



సంతతి పెరగకుండా శునకాలకు చికిత్స చేయాల్సి ఉండగా.. కొన్ని రోజులకే పరిమితమవుతోంది. కొన్ని శునకాలకు చికిత్స చేసి మిగతా వాటిని వదిలేస్తున్నారు. వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలు ఒంటరిగా వెళుతున్న చిన్నారులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఈ కారణంగా చిన్నారులను ఒంటరిగా బయటకు పంపాలంటే వారి కుటుంబ సభ్యులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పడేయడంతో వాటిని తినేందుకు కుక్కలు రోడ్లపై గుంపులుగా చేరుతున్నాయి. ఆ మార్గంలో ద్విచక్ర వాహనదారులు వెళితే వెంటపడుతున్నాయి. వీటి బారినుంచి రక్షించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ఎంతోమంది గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

రాత్రి సమయంలో గుంపులుగా స్వైర విహారం చేస్తున్న శునకాలు ఆ మార్గంలో ఎవరైనా వస్తే దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయంలో వీధుల్లో ఒంటరిగా కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణాల్లో కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటామని పుర అధికారులుకు తెలిపారు.



# మంగళగిరిలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

అమరావతి: మంగళగిరి మండలం ఆత్మకూరులో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్వర్గీయ డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు విగ్రహాలను మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం రూ. 1.72 కోట్లతో ఆధునీకరించిన శాఖా గ్రంథాలయ భవనాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయావరణలో మొక్కలు నాటారు.

**బెక్‌హామ్‌కు ధన్యవాదాలు తెలిపిన లోకేశ్...** విజయనగరం జిల్లా కొత్తవలస ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ప్రఖ్యాత ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్‌కు మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులతో ఆయన గడిపిన ప్రతిక్షణం వారికి మరపురాని అనుభవంగా మారిందన్నారు. ఆటపాటలతో కూడిన ఉత్సాహం పాఠశాల వాతావరణాన్ని ఉత్సవంలా మార్చిందన్నారు. పిల్లల విద్య, కలలు, భవిష్యత్ కోసం బెక్‌హామ్ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.




## బంగాళాఖాతంలో 'దిత్వాహ్' తుపాను.. పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు–పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులుతోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను ట్రింకోమలీ(శ్రీలంక)కి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మొక్కజొన్న రైతుల కోసం ప్రత్యేక చర్యలు: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి: మొక్కజొన్న రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు అంశంపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధర సేకరణకు ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వెల్లడించారు.

పౌల్ట్రీ, విత్తన, ఫార్మా సంస్థలు కొనుగోలును మరింత వేగవంతం చేయాలన్నారు. మొక్కజొన్న సేకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించామని తెలిపారు. ఈ విడత 1.42 లక్షల హెక్టార్లలో పంట సాగు చేయగా.. 8.18 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.




## శ్రీవారి విషయంలో ఏ తప్పు చేయలేదు.. వైవీ సుబ్బారెడ్డి కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ, నవంబరు27 : టీటీడీ ఆస్తులపై తాము శ్వేతపత్రం విడుదల చేశామని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీవారి లడ్డూ విషయంలో తనను సిట్ విచారణ చేస్తే కూడా ఇవే అంశాలు చెప్పానని గుర్తుచేశారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూపై పాలీగ్రాఫ్ పరీక్షకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఇవాళ(గురువారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు వైవీ సుబ్బారెడ్డి. 2014 నుంచి 2019 వరకు మాత్రమే నెయ్యిపై ఎందుకు విచారణ చేస్తున్నారని... అంతకుముందు కూడా విచారణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపణలు చేశారు వైవీ సుబ్బారెడ్డి.

**ఏ తప్పు చేయలేదు..** స్వామి వారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. శ్రీవారి ఆలయ ప్రతిష్ఠ పెంచేలా పనిచేశాను తప్ప.. దేవుడి విషయంలో ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. 30 సార్లు తాను అయ్యప్ప మాల వేసుకున్నానని గుర్తుచేశారు. తనపై తప్పుడు నిందలు వేస్తున్నారని ఆరోపించారు. లడ్డూ వ్యవహారాన్ని రాజకీయ అంశంగా మార్చారని విమర్శించారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేయడంతో సుప్రీంకోర్టులో కేసు వేశానని గుర్తుచేశారు. తాను తప్పు చేస్తే ఎందుకు సుప్రీంకోర్టుకు వెళ్తానని ప్రశ్నించారు వైవీ సుబ్బారెడ్డి.

**మీడియాలో కథనాలు దురదృష్టకరం..** 'లడ్డూ ప్రసాదంలో కలిసింది.. జంతువుల కొవ్వా.. లేదా వెజిటెబుల్ ఆయిలా అనేది ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నెయ్యి ట్యాంకర్లు పరిశీలించిన తర్వాతే లడ్డూ తయారీకి నెయ్యిని వినియోగించాం. ల్యాబ్ టెస్టులు జరిగినప్పుడు లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఎలా కలిసింది. 2019 నుంచి 2024 మధ్య కల్తీ నెయ్యితో లడ్డూల తయారీ జరిగిందని తప్పుడు ప్రచారం జరుగుతుంది. సిట్ దర్యాప్తు జరుగుతుంటే ..కల్తీ నెయ్యితో లడ్డూల తయారీ జరిగిందని మీడియాలో కథనాలు దురదృష్టకరం. మీడియా సంయమనం పాటించాలి' అని వైవీ సుబ్బారెడ్డి సూచించారు.

**సిట్ దర్యాప్తు సమగ్రంగా జరగాలి..** 'కిలో నెయ్యి రూ.326లకు కొనుగోలు చేశాం. తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో కల్తీ నెయ్యి వినియోగం జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో నెయ్యి కొనుగోళ్లు, కల్తీ వ్యవహారంపై సిట్ దర్యాప్తు సమగ్రంగా జరగాలి. టీటీడీ ద్వారా లాభ పడాలని నాకు, నా కుటుంబానికి లేదు. శ్రీనివాస సేతు నిర్మాణంలో రూ.50 నుంచి 70 కోట్ల వరకు నిర్మాణ వ్యయం తగ్గించాం. శ్రీవారి ఆదాయాన్ని కాపాడినా మా పై నిందలు వేస్తున్నారు. L1, L2 దర్శనాలు రద్దు చేశాం. పారదర్శకంగా ఉండేందుకు శ్రీవాణి దర్శనం తెచ్చాం. తిరుమలలో ప్లాస్టిక్ సంపూర్ణంగా నిషేధించాం. 516 గోశాలలకు ఆర్థిక సహాయం చేశాం. పద్మావతి హృదయాలయం ఆస్పత్రి స్థాపించాం' అని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

**సీఐడీ విచారణకు హాజరవుతా..** 'పరకామణి విషయంలో ఏం జరిగిందో నాకు తెలియదు. పరకామణిలో దొంగతనం జరిగిందని.. సీఐడీ విచారణకు రమ్మని చెప్పారు. పరకామణి అంశంలో రేపు (శుక్రవారం) విజయవాడలో సీఐడీ విచారణకు హాజరవుతాను. అప్పన్న గతంలో నా పీఏ మాత్రమే... ఆ తర్వాత ఆయన నాతో లేరు. టీటీడీ వ్యవహారంలో అప్పన్నకు సంబంధం లేదు. అదే అంశాన్ని సిట్‌కు చెప్పాను . తిరుమలలో అప్పన్న దర్శనానికి వస్తే వచ్చారేమో కానీ నాకు తెలియదు' అని వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు.





అమరావతి: విద్యార్థుల మాక్ అసెంబ్లీలో ప్రతిపక్షం ఎలా వ్యవహరించిందో చూసైనా వైకాపా అధినేత జగన్ నేర్చుకోవాలని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు హితవు పలికారు. చిన్న పిల్లలైనా ఎలాంటి తాత్కాలిక, శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా, ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కనీసం ఇప్పటికైనా జగన్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. సభ వెలుపల మాట్లాడటం కంటే, ప్రజాప్రతినిధిగా సభలో హాజరై చర్చించడం ముఖ్యమని ఇప్పటికైనా తెలుసుకోవాలని సూచించారు. లేదంటే త్వరలోనే అర్హత కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బుధవారం అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి సభ నడిపిన విషయం తెలిసిందే.




**అల్లూరి జిల్లా పాడేరులో చలి వణికిస్తోంది. తెల్లవారుజామున ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు, సముద్రమట్టానికి 3300 అడుగుల ఎత్తులో ఉన్న అమ్మవారి పాదాల ఘాట్ వద్ద ప్రకృతి రమణీయత ఆకట్టుకుంటోంది. సూర్యోదయాన మంచును చీల్చుకొని కిరణాలు సరుగుడు చెట్ల పై నుంచి ప్రసరించే దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.**

## అంతర్జాతీయ డిజిటల్ అరెస్టు ముఠా గుట్టు రట్టు.. 13 మంది అరెస్టు



భీమవరం: అంతర్జాతీయ డిజిటల్ అరెస్టు ముఠా గుట్టును భీమవరం పోలీసులు రట్టు చేశారు. ఇటీవల విశ్రాంత ప్రొఫెసర్ శర్మ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.78 లక్షలు దోచుకున్నారు. సిమ్ కార్డు వచ్చిందని, సీబీఐ అధికారులమంటూ ఆయనకు ఫోన్ చేశారు. సిమ్ కార్డులో తేడా ఉందని తాము సరిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు బెదిరించారు. ఈక్రమంలో శర్మ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను ముఠాకు తెలిపారు. 13 రోజుల వ్యవధిలో ఆయన ఖాతాలో ఉన్న రూ.78 లక్షలను నేరగాళ్లు కాజేశారు. దీంతో బాధితుడు క్రైమ్ బ్రాంచ్ పోలీసులను ఆశ్రయించాడు. భీమవరం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 7 బృందాలుగా వేట మొదలుపెట్టారు. మొత్తం 14 మందిని నిందితులుగా గుర్తించి 13 మందిని అరెస్టు చేశారు. ముంబయికి చెందిన ప్రధాన సూత్రధారి రహతే జె నయన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నామ్ నయీమ్ అస్మి వెల్లడించారు. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, ఒంటరి వాళ్లే ఉంటున్నారని చెప్పారు. బాధితుడికి బెంగుళూరు నుంచి సిమ్ కార్డు పేరుతో ఫోన్ వచ్చిందని చెప్పారు. " 14 మంది నిందితుల్లో ఏడుగురు గతంలో కంబోడియా దేశంలో పనిచేశారు. రూ.78 లక్షల్లో రూ.42 లక్షలు రికవరీ చేశాం. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.19 లక్షలు ఫ్రీజ్ చేశాం. ఇలాంటి కేసుల్లో ఇంత మొత్తంలో నగదు రికవరీ చేయడం ఇదే మొదటిసారి. నిందితులు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ఉన్నారు. వీరిలో కొంతమంది టెకీలు సైతం ఉన్నారు. ఒకరు ప్రముఖ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. డిజిటల్ అరెస్టు అంటూ ఏదీ ఉండదు. డిజిటల్ అరెస్టు పేరుతో ఫోన్లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి" అని ఎస్పీ తెలిపారు.




అమరావతి, నవంబర్ 27: రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై త్రిసభ్య కమిటీ మరోసారి సమావేశమైంది. జరీబు – మెట్ట భూముల అంశం, గ్రామ కంఠాలు, అసైన్డ్, లంక భూముల రైతుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. వీలైనంత వరకు త్వరితగతిన సమస్యలు పరిష్కారంపై కమిటీ దృష్టి పెట్టింది. రైతుల ప్లాట్లకు హద్దు రాళ్లు వేసి వెంటనే అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. గుంటూరు, మంగళగిరి నుంచి అమరావతికి వచ్చే రోడ్ల అభివృద్ధిపైనా కమిటీలో చర్చ జరిగింది. ఎల్లుండి (ఈనెల 29) ఉదయం మరోసారి సమావేశం కావాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అధికారులు హాజరయ్యారు. కాగా.. ఈనెల 22న తొలి సమావేశం జరుగగా.. ఆరునెలల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. కేంద్రమంత్రి పెమ్మసాని అధ్యక్షతన సమావేశం జరిగింది. సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై సమావేశంలో చర్చించిన విషయం తెలిసిందే. రైతులు ఎవరూ కూడా అపోహలు నమ్మొద్దని అన్నారు. ఆరు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని స్పష్టం చేశారు.

## శ్రీ సత్యసాయి జిల్లాలో దారుణం.. నాలుగేళ్ల బాలుడి హత్య

తలుపుల: శ్రీ సత్యసాయి జిల్లా ఎన్.పి.కుంట మండలం గౌకనపేటలో దారుణం చోటు చేసుకుంది. హర్షవర్ధన్ (4) అనే బాలుడిని మేనత్త భర్త హత్య చేశాడు. బుధవారం అదృశ్యమైన బాలుడు హత్యకు గురైనట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. నిందితుడు ప్రసాద్ కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తన కుమారుడి వైద్యానికి డబ్బులివ్వలేదని బావమరిదిపై కక్ష పెంచుకున్న ప్రసాద్.. బుధవారం ఉదయం బావమరిది కుమారుడు హర్షవర్ధన్‌ను అపహరించాడు. అదృశ్యంపై గంగాధర్ దంపతులు నిన్న సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇవాళ ఉదయం ఎన్.పి.కుంట మండలం గౌకనపేటలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. నిన్న అపహరణకు గురైన బాలుడే హత్యకు గురైనట్లు డీఎస్పీ శివనారాయణస్వామి నిర్ధరించారు.



## బ్లాక్ వెల్వెట్ చీరలో ఫాతిమ నాజూకు సొగసు

దంగల్ ఫేం ఫాతిమా సనా షేక్ చురుకైన హావభావాలు, ఫ్యాషన్ సెన్స్ కి ప్రత్యేకించి ఫ్యాన్సున్నారు. ఇటీవల ఈ బ్యూటీ బొద్దుతనం నుంచి మారిపోయి, సన్నజాజి తీగలా మెరిసిపోతోంది. మొన్నటికి మొన్న ఓ ఇంటర్వ్యూలో ఈ బ్యూటీ చెప్పిన కొన్ని వ్యక్తిగత అనారోగ్య సమస్యలు నిజంగా అభిమానులకు షాకిచ్చాయి. తనకు అదుపు తప్పి తినే అలవాటు ఉందని, దానివల్ల చాలా బరువు పెరిగానని, తిండిని కట్టేసే శక్తి తనకు లేదని ఫాతిమా చెప్పింది. తినడానికి ఏదైనా ఉంటే, గంటల తరబడి తినగలనని అది చూసి సహచరులు ఝుడుసుకుంటారని కూడా చెప్పింది. బాగా తినే అలవాటు చాలా పెద్ద సమస్య. సెట్ లో అందరూ చూస్తుంటే సిగ్గుగా ఉండేదని కూడా చెప్పింది. కానీ ఇప్పుడు దానిని అధిగమించానని తెలిపింది. ఫాతిమా ఆహార నియమాలను మార్చుకుంది.. చికిత్సను తీసుకుంది. ఫిట్ లుక్ కోసం జిమ్ లో చాలా శ్రమిస్తోంది. ఇటీవల టోన్డ్ లుక్ ను సాధించింది.. రూపం చాలా మారింది. అందాల ఫాతిమ ఇప్పుడు సన్నజాజి తీగను తలపిస్తోంది. తాజాగా విడుదలకు సిద్ధమవుతున్న




గుస్తాక్ ఇష్క్ సినిమా ప్రమోషన్లలో ఫాతిమా నల్ల రంగు వెల్వెట్ చీర ధరించి గుబులు రేపిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. ఇది వింటర్ ఎడిషన్.. బ్లాక్ వెల్వెట్ చీరకు తగ్గట్టుగా, కిల్లర్ కటౌట్ బ్లౌజ్, బోల్డ్ ఎమరాల్డ్ లాకెట్టు ధరించిన ఫాతిమా చాలా స్పెషల్ గా కనిపిస్తోంది. రెడ్ కార్పెట్ పై ఈ బ్యూటీ కిల్లింగ్ గా కనిపించింది. ప్రస్తుతం ఫాతిమా ఐకానిక్ ఫోజులు ఇంటర్నెట్ లో వైరల్‌గా మారుతున్నాయి. ఎత్తైన నెక్‌లైన్, పాలిష్ చేసిన ఫ్రంట్ కటౌట్, చిన్న స్ట్రక్చర్డ్ స్లీవ్‌లు, సైడ్ కట్ స్టైలింగ్ పీస్ తో బ్లౌజ్ కూడా ఈ చీరకు అంతే మ్యాచ్ అయింది. ఫాతిమా లుక్ కేవలం స్టైలింగ్ వల్లనే కాదు.. తన హొయలుతోను మరో స్థాయి ఎలివేషన్ కి చేరుకుంది. ఫోటోషూట్ కోసం అందమైన భంగిమలతోను దంగల్ బ్యూటీ గుబులు రేపింది. మనీష్ మల్హోత్రా ఈ డిజైనర్ చీర – అందమైన బ్లౌజ్‌ను డిజైన్ చేసారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ఫాతిమ నటించిన తాజా చిత్రం %-%గుస్తాక్ ఇష్క్%-% ట్రైలర్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో విజయ్ వర్మ కథానాయకుడిగా నటించగా, నసీరుద్దీన్ షా ఫాతిమా తండ్రిగా నటించారు. ఇది ఒక అందమైన రొమాంటిక్ లవ్ స్టోరి. సంగీతం నేర్చుకోవడానికి వచ్చిన యువకుడు గురువు కుమార్తెను ప్రేమించాక ఏం జరిగిందనేదే ఈ సినిమా. ఇందులో ఫాతిమా నటనకు ఆస్కారం ఉన్న పాత్రను పోషించింది. ఈనెల 28న సినిమా విడుదల కావాల్సి ఉండగా, ఈరోజు ముంబైలో సెలబ్రిటీ ప్రీమియర్ ని చిత్రబృందం ప్లాన్ చేసింది. కానీ హీమ్యాన్ ధర్మేంద్ర మృతి అనంతరం సంస్మరణం గౌరవార్థకంగా ప్రీమియర్ ని చిత్రబృందం వాయిదా వేసుకుంది.

## ఎల్లమ్మ.. ఇబ్బందులు దాటేదెలా..?

బలగం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న వేణు యెల్దండి తన రెండో సినిమాను ఎల్లమ్మ అంటూ ప్రకటించాడు. దాదాపు రెండేళ్ల నుంచి ఆ సినిమా స్క్రిప్ట్ మీద కూర్చున్న వేణు అదిరిపోయేలా కథ రాసుకున్నాడు. సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొత్తం పూర్తైంది. బలగం లాంటి హిట్ ఇచ్చాడు కాబట్టి ఈసారి వేణు కోరినంత బడ్జెట్ ఇచ్చేందుకు దిల్ రాజు డిసైడ్ అయ్యారు. ఇక సినిమా మొదలు పెట్టడమే తరువాయి అనుకుంటున్న టైం లో ఎల్లమ్మ కాస్టింగ్ పై జరుగుతున్న చర్చలు షాక్ ఇస్తున్నాయి.

**తమ్ముడు డిజాస్టర్ అవ్వడంతో..** ముందు ఈ సినిమాలో హీరో ఎవరన్నది ఇప్పటికీ సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఎల్లమ్మ సినిమాను ముందు నానితో చేయాలనుకున్నాడు వేణు కానీ హీరోయిన్ పాత్రకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఉండటం వల్ల అతను కాదన్నాడట. ఇక రేసులో నితిన్ వచ్చాడు. ఐతే దిల్ రాజు, నితిన్ చేసిన తమ్ముడు డిజాస్టర్ అవ్వడంతో నితిన్ తో ఎల్లమ్మ కూడా రిస్క్ అని భావించాడు దిల్ రాజు. అందుకే ఎల్లమ్మలో నితిన్ దాదాపు కన్ ఫర్మ్ అని చెప్పి మరీ



అతన్ని బయటకు వెళ్లేలా చేశారు. ఇక శర్వానంద్ తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ కూడా ఈ సినిమాలో నటిస్తాడన్న వార్తలు వచ్చాయి. వీరవరు కాదు మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాలో నటిస్తున్నారని అంటున్నారు. ఐతే ఎల్లమ్మ హీరో గురించి ఇంతగా డిస్కషన్ జరుగుతుండగా హీరోయిన్ గా కీర్తి సురేష్ ఫైనల్ అని అనుకున్నారు. వేణు ఈ సినిమాలో ముందు సాయి పల్లవిని హీరోయిన్ గా అనుకోగా ఆమె ఈ సినిమా చేయడానికి డేట్స్ అడ్జెస్ట్ కావని చెప్పడంతో ఆ ఆఫర్ కీర్తి సురేష్ కి వచ్చింది.

**ఇప్పుడు హీరోయిన్ కూడా లేదన్న మ్యాటర్..** ఐతే లేటెస్ట్ గా కీర్తి సురేష్ తన కొత్త సినిమా రిలీజ్ ప్రమోషన్స్ లో ఎల్లమ్మలో తాను నటించట్లేదని చెప్పి షాక్ ఇచ్చింది. ఎల్లమ్మ సినిమాలో ఇన్నాళ్లు హీరో మాత్రమే కన్ ఫర్మ్ అవ్వలేదని అనుకుంటుండగా ఇప్పుడు హీరోయిన్ కూడా లేదన్న మ్యాటర్ అర్థమైంది. కీర్తి సురేష్ ముందు చేయాలని అనుకుని తర్వాత కాదన్నదా లేదా ఆమె ముందు నుంచి రిజెక్ట్ చేసిందా అన్నది తెలియాల్సి ఉంది. కీర్తి సురేష్ ఎల్లమ్మ కామెంట్స్ పై ఆడియన్స్ అంతా షాక్ అవుతున్నారు. కీర్తి కాకపోతే ఎల్లమ్మ లో ఫిమేల్ లీడ్ గా ఎవరికి ఛాన్స్ ఇస్తారు.. సినిమాలో హీరోయిన్ పాత్ర వెయిట్ ఎక్కువ ఉంటుందని తెలిసినా కూడా ఎవరు ఈ ప్రాజెక్ట్ పై ఎందుకు ఆసక్తి చూపించట్లేదు అన్నది తెలియాల్సి ఉంది. మరి దిల్ రాజు ప్రొడక్షన్ లో ప్రెస్టీజియస్ గా రాబోతున్న ఎల్లమ్మ మీద ఇన్ని రకాలుగా డిస్కషన్ జరగడం కొత్తగా ఉంది. మరి వీటన్నిటికీ ఆన్సర్ ఇస్తూ ఎస్.వి.సీ బ్యానర్ నుంచి ఏదైనా అప్డేట్ వస్తే బెటర్ లేదంటే సినిమా మీద ఉన్న ఇంట్రెస్ట్ కాస్త పడిపోయే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.




## శర్వా బైకర్.. రేసులో ఊహించని బ్రేక్




సినిమా ఇండస్ట్రీలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేశాక వెనక్కి తగ్గడం అంటే ఫ్యాన్స్ కు కొంచెం నిరాశ కలిగించే విషయమే. చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న 'బైకర్' సినిమా విషయంలో కూడా ఇప్పుడు అదే జరిగింది. డిసెంబర్ 6న థియేటర్లలో దుమ్ములేపడానికి సిద్ధమైన ఈ రేసర్, సడెన్ గా బ్రేక్ వేశాడు. అయితే ఈ వాయిదా వెనుక సాధారణ కారణాలు కాకుండా, ఒక మైండ్ బ్లోయింగ్ ప్లాన్ ఉందని మేకర్స్ ఇచ్చిన అప్డేట్ ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా పోస్ట్ ప్రొడక్షన్ లేట్ అయ్యిందో, షూటింగ్ అవ్వలేదో వాయిదా వేస్తుంటారు. కానీ 'బైకర్' టీమ్ ఆలోచన వేరే లెవెల్ లో ఉంది. కేవలం సినిమాను చూపించడమే కాదు, ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. అందుకే అనుకున్న తేదీకి రాలేకపోతున్నామని, కానీ తిరిగి వచ్చేటప్పుడు మాత్రం అంతకు మించి ఉంటుందని ఒక అఫిషియల్ నోట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. అసలు విషయం ఏంటంటే.. 'బైకర్' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాని రెడీ చేయడానికి తమ కాస్ట్ అండ్ క్రూ నిద్రలేని రాత్రులు గడిపారని, అయితే అవుట్ పుట్ చూసాక ఇది కేవలం స్క్రీన్ మీద చూసే సినిమా మాత్రమే కాదని, అంతకు మించిన ఎక్స్పీరియన్స్ అని అర్థమైందని మేకర్స్ తెలిపారు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు సరికొత్త టెక్నాలజీతో తీసుకురాబోతున్నారు. కేవలం 2Dలోనే కాకుండా, 3D మరియు 4DX ఫార్మాట్లలో కూడా 'బైకర్' రిలీజ్ కానుందట. రేసింగ్ సన్నివేశాలు, హై యాక్షన్ సీక్వెన్సులు 4DX లో చూస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఆ అడ్రినలిన్ రష్ ను ఆడియన్స్ కు ఫీల్ అయ్యేలా చేయడానికే ఈ సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా ఇప్పటివరకు చూడని భారీ స్కేల్ లో ఈ సినిమా ఉండబోతోందని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది. "హెల్మెట్లు టైట్ గా పెట్టుకోండి.. లైఫ్ టైమ్ రైడ్ కు సిద్ధమవ్వండి" అంటూ మేకర్స్ ఇచ్చిన వార్నింగ్ ఫ్యాన్స్ లో అంచనాలను పెంచేసింది. శర్వానంద్ కెరీర్ లోనే ఇదొక బెంచ్ మార్క్ సినిమాగా నిలిచే అవకాశం ఉంది. మొత్తానికి డిసెంబర్ 6న రావలసిన సినిమా వాయిదా పడినా, 3D మరియు 4DX రూపంలో రాబోతున్న ఈ గుడ్ న్యూస్ ఫ్యాన్స్ ను కూల్ చేసింది. కొత్త రిలీజ్ డేట్ ను త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు. మరి ఈ లేటెస్ట్ టెక్నాలజీతో శర్వానంద్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రేస్ ని చూపిస్తాడో చూడాలి.

## డ్రాగన్ ఇంటర్నేషనల్ రిలీజ్!





సూపర్ స్టార్ మహేష్ హీరోగా నటిస్తోన్న వారణాసి గ్లోబల్ స్థాయిలో రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే 120 దేశాల్లో చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా రాజమౌళి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఒక్క హిట్ తోనే మహేష్ ని ఇంటర్నేషనల్ స్టార్ ని చేయాలన్నది రాజమౌళి ప్లాన్. దీనిలో భాగంగానే పక్కా ప్రణాళికతో %వారణాసిని కనెక్ట్ చేసే ప్రయత్నంచేస్తున్నారు. రిలీజ్ అవుతున్న 120 దేశాలు లిస్ట్ బయటకు రావాల్సి ఉంది.

పాన్ ఇండియా సినిమాకు బాహుబలితో ఓ బాట వేసారని కొందరు భావిస్తుంటే? ఆ తర్వాత రిలీజ్ అయిన ఆర్ ఆర్ ఆర్‌తో ఏకంగా సిక్స్ లైన్ హేవేనే వేసారన్నది మరికొంత మంది అభిప్రాయం. ఇందులో ఆ మాటను బలంగా సమర్ధించిన దర్శకుడు ప్రశాంత్ నీల్. తాను రాజమౌళినే స్పూర్తిగా సినిమాలు తీస్తున్నట్లు ఓ సందర్భంలో తెలిపారు. ఇప్పటి వరకూ నీల్ నుంచి రిలీజ్ అయిన కేజీఎఫ్, సలార్ రెండు పాన్ ఇండియాకే పరిమితమయ్యాయి. ఇతర దేశల్లో రిలీజ్ అయినా? అనుకున్నంతగా రెస్పాన్స్ రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ తో తెరకెక్కిస్తోన్న డ్రాగన్ చిత్రాన్ని మాత్రం ప్రశాంత్ నీల్ కూడా అంతర్జాతీయంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. భారత్, అమెరికా, చైనా, రష్యా, జపాన్ లాంటి దేశాలతో పాటు వీలైనన్ని దేశాల్లో డ్రాగన్ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. తాను రాసుకున్న కథ యూనివర్శల్ గా కనెక్ట్ అవుతుందని భావించి ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ కూడా తాను ఏ కథ రాసుకున్నా? ఆ కథకు ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తాడు. ప్రేక్షకుల్ని ఆ ప్రపం చంలోకి అంతే జీగా తీసుకెళ్లగల ప్రతిభావంతుడు. కేజీఎఫ్,సలార్ లు అలాంటి కాన్సెప్టులే. బ్యాక్ డ్రాప్ లు ఒకేలా అనిపించినా? కథని మాత్రం కొత్త కోణంలో నడిపించాడు. ఈ నేపథ్యంలో డ్రాగన్ కథ ఎలా ఉంటుంది? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కానీ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ అవుతంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సినిమా కోసం తారక్ ప్రత్యేకంగా సన్నధమయ్యాడు.

లుక్ పరంగా చాలా మార్పులు తీసుకొచ్చాడు. మునుపటి కంటే బాగా స్లిమ్ లుక్ లోకి మారిపోయాడు. దీంతో ప్రతీ ఫ్రేమ్ లో తారక్ ఎంతగా హైలైట్ అవుతాడు? అన్నది అభిమానుల ఊహకే వదిలేయాలి. ప్రత్యేకించి తారక్ కు జపాన్ లో భారీ ఎత్తున అభిమానులున్న సంగతి తెలిసిందే. అక్కడ మాత్రం వీలైనన్ని థియేటర్లలో డ్రాగన్ రిలీజ్ కానుంది.

## బ్యాడ్మింటన్ కోర్టులో అషు రెడ్డి గ్లామర్ హీట్

సోషల్ మీడియా సెన్సేషన్గా, డబ్స్మాష్ వీడియోలతో పాపులర్ అయిన అషు రెడ్డి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. జూనియర్ సమంతగా నెటిజన్ల మనసు గెలుచుకున్న ఈ బ్యూటీ, బిగ్ బాస్ షోతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. నిత్యం ఏదో ఒక గ్లామరస్ అప్డేట్తో ఇంటర్నెట్లో హల్చల్ చేయడం ఆమెకు అలవాటుగా మారింది. లేటెస్ట్ గా అషు రెడ్డి షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో సెగలు రేపుతున్నాయి. అమెరికాలోని ఫ్లోరిడాలో బ్యాడ్మింటన్ ఆడుతూ, ఆలివ్ గ్రీన్ కలర్ బ్యాక్లెస్ జంప్సూట్ ధరించి ఎంతో గ్లామరస్ గా దర్శనమిచ్చారు. చేతిలో రాకెట్ పట్టుకుని, వెనుక వైపు తిరిగి తన ఫిట్ బాడీని, స్టైలిష్ లుక్ను హైలెట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ఆమె పెట్టిన ఆసక్తికరమైన క్యాప్షన్ లో ఆమెలోని మనోధైర్యాన్ని, ఫిట్నెస్ పట్ల ఉన్న శ్రద్ధను సూచిస్తోంది. 'చల్ మోహన్ రంగ' సినిమాతో వెండితెరకు పరిచయమైనా, ఆమెకు అసలైన గుర్తింపు తెచ్చిపెట్టింది మాత్రం 'బిగ్ బాస్' రియాలిటీ షోనే. హౌస్లో తన



ఆటతీరుతో, గ్లామర్తో, బోల్డ్నెస్తో ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. అప్పటి నుంచి బుల్లితెరపై, వెండితెరపై వరుస అవకాశాలను అందుకుంటూ తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. కేవలం గ్లామర్కే పరిమితం కాకుండా, రామ్ గోపాల్ వర్మతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూలతోనూ అషు రెడ్డి ఇంటర్నెట్ను షేక్ చేశారు. ప్రస్తుతం ఆమె ఎక్కువగా విదేశీ పర్యటనలతో ఎంజాయ్ చేస్తున్నారు. ఖరీదైన కార్లు, లగ్జరీ లైఫ్స్టైల్తో సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉంటారు. నటిగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తూనే, డిజిటల్ ప్లాట్ఫామ్స్లో తన సత్తా చాటుతున్నారు. సినిమా అవకాశాలు పెద్దగా లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అషు రెడ్డి ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదు. ఇలాంటి గ్లామర్ ఫొటోషూట్లతో, ట్రెండీ రీల్స్తో తన ఫ్యాన్స్ను ఎప్పుడూ ఎంటర్టైన్ చేస్తూనే ఉంటారు. గ్లామర్ డోస్ పెంచుతూ, నెట్టింట తన క్రేజ్ను కాపాడుకోవడంలో అషు రెడ్డి ఎప్పుడూ ముందుంటారు. మరి అమ్మడు భవిష్యత్తులో ఏవైనా గ్లామరస్ ఛాన్సులు అందుకుంటుందో లేదో చూడాలి.

## సమంత.. ఫేవరెట్ టైమ్ ఏంటో తెలుసా?

స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఫుల్ గా యాక్టివ్ గా ఉంటారన్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటారు. తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన అప్డేట్స్ కూడా ఇస్తుంటారు. అవి ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్.. నెట్టింట స్పెషల్ గా ఉండి ఆకట్టుకుంటాయి. తాజాగా తన ఇయర్ లో ఫేవరెట్ టీమ్ ఏంటో చెబుతూ పోస్ట్ చేశారు సమంత. అంతకుముందు ముంబైలోని తన ఇంటి మెయిన్ డోర్ పిక్ ను షేర్ చేశారు. డోర్ చుట్టూ స్పెషల్ డెకరేషన్ చేసి ఉంది. మరోనెల రోజుల్లో క్రిస్మస్ పండుగ రానుండగా.. ఇప్పుడే సామ్ ఆ ఫెస్టివల్ మోడ్ లోకి వెళ్లిపోయారు. తన ఇంటిని డెకరేట్ చేసుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ కు ఓవైపు క్రిస్మస్ ట్రీ పార్ట్ ను అటాచ్ చేయగా.. మరోవైపు స్టైలిష్ "%వాూవీ%"లోగో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ సంవత్సరం ఇలా అన్నట్లు క్యాప్షన్ ఇవ్వగా.. మరో పిక్ లో ఇంట్లో క్రిస్మస్ థీమ్ డెకరేషన్ చేసుకున్న పిక్ పోస్ట్ చేశారు. ఆ ఫోటోకు అదే తన ఫేవరెట్ టైమ్ అంటూ




రాసుకొచ్చారు సమంత. ప్రస్తుతం సమంత ఇన్ స్టా స్టోరీస్ కు సంబంధించిన స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. దీంతో డెకరేషన్ అదిరిపోయిందని సామ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అడ్వాన్స్ హ్యాపీ క్రిస్మస్ అంటూ విషెస్ చెబుతున్నారు. ఫుల్ గా సెలబ్రేట్ చేసుకోండని అంటున్నారు. అయితే సమంత.. పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలతో కొంతకాలంగా వార్తల్లో నిలుస్తున్నారు. గత కొంత కాలంగా బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఆమె సన్నిహితంగా ఉన్నారని, వారిద్దరూ డేటింగ్ లో ఉంటున్నారని సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఎక్కడా సమంత రెస్పాండ్ అవ్వలేదు. కానీ రాజ్ నిడిమోరుతో కలిసి పార్టీలకు, సినిమా ఈవెంట్స్ కు సామ్ వెళ్లడంతో రిలేషన్ షిప్ రూమర్లకు మరింత బలం చేకూరుతుంది. వారిద్దరూ ఎక్కడ కనిపించినా అక్కడికి సంబంధించిన వీడియోలు, దిగిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. రీసెంట్ గా దీపావళి పండుగ ఇద్దరూ కలిసి జరుపుకున్నారు. మరి రిలేషన్ షిప్ రూమర్స్ లో నిజమెంతో వారికే తెలియాలి.




## బెడిసి కొట్టిన వీరన్న స్కెచ్.. నిందితులను పట్టించిన బొలెరో

గద్వాల: బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మాజీ సర్పంచి ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. అంతా రోడ్డు ప్రమాదమని భావించారు. కుటుంబ సభ్యులు మాత్రం ప్రణాళిక ప్రకారం చేసిన హత్య అని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వారం రోజుల్లో కేసును ఛేదించారు. పైకి కనిపిస్తున్నట్లు అది ప్రమాదం కాదని.. రూ.25 లక్షలు సుపారీ ఒప్పందం కుదుర్చుకుని, నెల రోజులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా నిర్ధరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడిని సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించడం జిల్లాలో సంచలనం రేపింది. కేసు వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల 21న నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడు ద్విచక్ర వాహనంపై గద్వాల నుంచి సొంతూరు నందిన్నెకు బయల్దేరారు. వెనుక నుంచి వచ్చిన బొలెరో ఆయన్ను బలంగా ఢీకొట్టింది. కొద్ది దూరం వాహనం సహా లాక్కెళ్లింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బొలెరో ముందు భాగంలో బైక్ ఇరుక్కు పోయింది. దీంతో డ్రైవర్ సహా.. అందులో ఉన్నవారంతా పరారయ్యారు.

ఈ ఘటనను తొలుత ప్రమాదంగా భావించారు. కానీ, కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదం జరిగిన తీరు చూసి ఉద్దేశపూర్వకంగానే ఢీ కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు వారం రోజుల్లో ప్రమాదం వెనక మిస్టరీని ఛేదించారు.

**హత్య కోసం బొలెరో వాహనానికి ప్రత్యేకంగా డిజైన్..** ఇది ప్రమాదం కాదని, రూ.25లక్షల సుపారీ కుదుర్చుకుని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా పోలీసులు నిర్ధరించారు. హత్యచేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని తేల్చారు. నందిన్నె గ్రామానికి చెందిన మిల్లు వీరన్న అలియాస్ కురువ వీరన్నకు.. మృతుడు చిన్నభీమ రాయుడికి మధ్య భూ వివాదాలు, రాజకీయ కక్షలు ఉన్నాయి. వీరన్న రైస్ మిల్లులో అక్రమాలపై అధికారులు సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. దీంతో చిన్నభీమ రాయుడిపై వీరన్న మరింత కక్ష పెంచుకున్నాడు. ఆయన్ను హత్య చేయించేందుకు కర్నూలుకు చెందిన ఈశ్వరయ్య గౌడ్‌తో రూ.25 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. హత్యచేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తే నేరం తమపైకి రాకుండా ఉంటుందని ప్రణాళిక రచించాడు. అందుకోసం కర్నూలు ఆటోనగర్‌లో బొలెరోకు ప్రత్యేకంగా బంపర్ తయారు చేయించారు. ఢీ కొడితే ఎదుటి వ్యక్తి అక్కడికక్కడే మరణించేలా, అదే సమయంలో వాహనానికి, అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నెలరోజులు రెక్కీ నిర్వహించారు. నాలుగుసార్లు హత్యాయత్నం చేసినా.. పరిస్థితులు అనుకూలించలేదు. ఈ నెల 21న అదునుచూసి జాంపల్లి బస్టాండ్‌కు సమీపంలో చిన్నభీమ రాయుడు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. చనిపోయాడని నిర్ధరించుకునే వరకూ బైక్ సహా ఈడ్చుకెళ్లారు. బైక్ ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు తీగ లాగితే డొంక కదిలింది.

**మిల్లు వీరన్నపై రోడ్డు ప్రమాదం కేసులు?...** జోగులాంబ గద్వాల జిల్లాలో సంచలనం రేపిన ఈ కేసులో మిల్లు వీరన్న సహా 10మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. హత్య చేసేందుకు వినియోగించిన బొలెరో, నాలుగు కార్లు, రెండు బైకులు, 11 సెల్‌ఫోన్లు, 13 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సుపారీ కింద రూ.25 లక్షలకు ఒప్పందం కుదరగా.. రూ.8 లక్షలు ముందుగానే ఇచ్చారు. మరో రూ.8.5 లక్షలు డ్రా చేసి నిందితులంతా వెళ్తుండగా పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. వారి నుంచి ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఐదుగురు గద్వాల జిల్లా వాసులు కాగా.. మిగిలిన నిందితులు కర్నూలుకు చెందిన వాళ్లు. వీరిలో కొందరిపై కేటీ దొడ్డి మండలంలో కేసులు నమోదై ఉన్నాయి. గతంలో మిల్లు వీరన్నపై రోడ్డు ప్రమాదం కేసులున్నాయి. అవి కూడా ప్రమాదాలా? లేక ఉద్దేశపూర్వకంగా చేసిన ఘటనలా? అనేది విచారణ జరపనున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు.




## మరోసారి కస్టడీకి ఐబొమ్మ రవి

హైదరాబాద్, నవంబర్ 27: ఐబొమ్మ రవిని మరోసారి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రవిని మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ నిన్న (బుధవారం) నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈరోజు (గురువారం) ఉదయం చంచల్‌గూడ జైలులో రవిని కస్టడీలోకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు.. అక్కడి నుంచి బషీర్ బాగ్ సీసీఎస్‌కు తరలించారు. రెండోసారి రవిని సీసీఎస్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. మూడు రోజుల పాటు విచారించనున్నారు. ఇప్పటికే ఐదు రోజుల పాటు రవిని పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించిన విషయం తెలిసిందే. గత విచారణలో రవి సహకరించకపోవడంతో మరో 3 రోజులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. ఎన్జెలా సర్వర్‌లో మాస్క్ ఐపీలపై , బెట్టింగ్ యాప్స్ నుంచి జరిగిన లావాదేవీలపై పోలీసులు విచారించనున్నారు.

బెట్టింగ్ యాప్ లావాదేవీలు, డొమైన్స్ ఇన్వాయిస్‌ల ఆధారంగా రవిని విచారించనున్నారు. ఐబొమ్మకు సంబంధించిన ఆధారాలను ముందు ఉంచి రవి నుంచి సమాచారం సేకరించాలని సైబర్ క్రైమ్ పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.




## కొత్తగా చేపట్టే థర్మల్ విద్యుత్ ప్లాంట్లపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలనేది తమ ప్రణాళిక అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిల్ట్ పాలసీ ఎన్నో రకాలుగా ప్రయోజనకరమని పేర్కొన్నారు. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందని.. దాన్ని సంక్షేమ, అభివృద్ధి పనులకు ఉపయోగిస్తామని వివరించారు. " ఏం చేసినా ప్రభుత్వాన్ని తప్పుపట్టాలనే ధోరణి ప్రతిపక్ష నేతల్లో కనిపిస్తోంది. కొత్తగా చేపట్టే థర్మల్ విద్యుత్ ప్లాంట్లపై కూడా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు.

విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన విద్యుత్ ప్లాంట్ ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని కాలం చెల్లిన పద్ధతిలో గత ప్రభుత్వం చేపట్టింది. సబ్ క్రిటికల్ పద్ధతి వల్ల ఆర్థికంగా, పర్యావరణం పరంగా తీవ్రమైన నష్టం. భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి కూడా భారంగా మారింది.


ఛత్తీస్‌గఢ్ నుంచి చేసిన విద్యుత్ కొనుగోళ్లలోనూ అవకతవకలు జరిగాయి. ఇంకా మంజూరు చేయని, నిర్మాణం జరగని విద్యుత్ ప్లాంట్‌లో అవినీతి ఎలా జరుగుతుంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రామగుండం, పాల్వంచ, మక్తల్‌లలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్మించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం వెనుక.. దాదాపు రూ.50 వేల కోట్ల స్కామ్ దాగి ఉందని భారత రాష్ట్రసమితి నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.




హైదరాబాద్, నవంబరు27: తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ఇవాళ(గురువారం) నుంచి ప్రారంభమైంది. ఈరోజు తొలి దశ నామినేషన్లు వేస్తున్నారు అభ్యర్థులు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. నేటి నుంచి ఈనెల 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తునట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఈనెల 30న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు డిసెంబర్ 3వ తేదీ వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు. డిసెంబర్ 11వ తేదీన తొలి విడతలో 189 మండలాలు, 37440 వార్డులు, 4,236 గ్రామాల్లో ఎన్నికలు జరగుతాయని ప్రకటించారు. ఆర్వో , ఏఆర్వోలుగా గెజిట్ ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించారు ఎన్నికల అధికారులు. మూడు నాలుగు గ్రామాలను కలిపి క్లస్టర్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. పోటీ చేసే అభ్యర్థులు ఆయా కేంద్రాల్లో నామినేషన్లు వేసేందుకు ఛాన్స్ కల్పించారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులుగా ఆర్వోలు, ఏఆర్వోలు వ్యవహరిస్తున్నారు. అభ్యర్థుల నగదు డిపాజిట్ కూడా వారికే అప్పగించారు. నామినేషన్‌తో పాటు ఫొటో, క్యాస్ట్ సర్టిఫికెట్, నో డ్యూస్ , బర్త్ సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్ నంబర్ జత చేయాలని ఎన్నికల అధికారులు సూచించారు. అభ్యర్థి అఫిడవిట్‌తో పాటు ఇద్దరు వ్యక్తులు సాక్షి సంతకం పెట్టాలని కోరారు. ఎస్సీ , ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రూ.1000లు... ఇతరులు రూ. 2000 డిపాజిట్ చేయాలని సూచించారు. వార్డు మెంబర్లకు పోటీ చేసే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ. 250... ఇతరులు రూ. 500 చెల్లించాలని ఆదేశించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

హైదరాబాద్: తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న సిట్ మళ్లీ విచారణ ప్రారంభించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్‌డీ రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు విచారించారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లో అతడిని రెండు గంటల పాటు ప్రశ్నించారు. ఇటీవల హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సజ్జనార్.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు విచారణ ఏ దశలో ఉంది? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జ్ షీట్లు తదితర అంశాలపై ఆరా తీశారు. కేసు విచారణపై దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్‌డీని విచారించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు, నిందితులను ఇప్పటికే పలువిడతలుగా సిట్ విచారించింది. నలుగురు పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులో 'భారత రాష్ట్రసమితి సుప్రీం' అనే పదాన్ని వాడారు. అంటే, కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు అప్పట్లో రాధాకిషన్‌రావు చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌కు ఓఎస్‌డీగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డిని విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.



## రిజర్వేషన్లపై హైకోర్టులో పిల్.. నేడు విచారణకు ఛాన్స్

హైదరాబాద్ : రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టులో మరోసారి పిటిషన్ దాఖలైంది. జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని కోరుతూ వికారాబాద్‌కు చెందిన మదివాలా మచ్చదేవ్ అనే వ్యక్తి పిటిషన్ వేశారు. ఎంపిరికల్ డేటా బహిర్గతం చేయకుండానే రిజర్వేషన్‌లు ఖరారు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రిజర్వేషన్‌లు ఇచ్చారు కానీ, రిపోర్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని తెలిపారు. జీవో నెంబర్ 46లో బీసీలోని ఏ బీ సీ డీ లకు రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వలేదని పిటిషన్‌లో మచ్చదేవ్ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై రేపు హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 46పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీసీ రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతానికి తగ్గించడంపై బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ జీవోను రద్దు చేయాలంటూ బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారంటూ మండిపడుతున్నారు. జీవో 46కు నిరసనగా ట్యాంక్ బండ్ వద్ద నిన్న (బుధవారం) బీసీ సంఘాల నేతలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వెంటనే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. అటు గాంధీ భవన్ ముట్టడికి కూడా బీసీ సంఘాలు యత్నించగా... పోలీసులు అడ్డుకున్నారు. వెంటనే జీవో 46ను రద్దు చేసి బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## బీసీ రిజర్వేషన్లు ఒక పొలిటికల్ డ్రామా.. ఎంపీ అరవింద్ షాకింగ్ కామెంట్స్




నిజామాబాద్, నవంబరు27 : బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లు ఒక పొలిటికల్ డ్రామా అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(గురువారం) నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఎంపీ అరవింద్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీలని పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు అమలు చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందని విమర్శించారు. పావలా వడ్డీకే కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పుకొచ్చారు. కేంద్ర నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎందుకు చేయడం లేదని నిలదీశారు. కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరగుతున్నాయని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని విమర్శలు చేశారు. రైల్వే పనులకు నిధులు విడుదల చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలిపారు. రైల్వే పనులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే నిరాహార దీక్ష చేస్తానని తాను ప్రకటించానని గుర్తుచేశారు. నిజామాబాద్ జిల్లాలో 10 ఆర్వోబీలు పూర్తి చేయాలనేది తన టార్గెట్ అని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.



## ఫ్రీ బస్సు ఇవ్వమని అడిగారా?.. తెలుగు రాష్ట్రాల్లో ఉచితాలపై వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలను ఉద్దేశించి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రీ బస్సు ఇవ్వండి మేము తిరుగుతాం అని మహిళలు అడిగారా?ప్రభుత్వాలు ఎందుకు ఉచిత పథకాలు తీసుకువస్తోందని ప్రశ్నించారు. సంపద సృష్టించే మార్గం చూడాలి కానీ అప్పులు తెచ్చి ఉచితాలు ఇవ్వడం సరికాదని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆధ్రప్రదేశ్?లోని గుంటూరు తెనాలిలో నిర్వహించిన సేవా జ్యోతి పురస్కార ప్రదాన కార్యక్రమానికి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏది కూడా ఉచితంగా ఇవ్వకూడదనేది నా అభిప్రాయం అన్నారు. ఉచిత పథకాలు ఇస్తుంటే నాకేం నష్టం కాదు. కానీ ఉదయం ఉచిత పథకాలు ఇచ్చి సాయంత్రం మద్యం రూపంలో ప్రభుత్వాలు మళ్లీ ప్రజల వద్ద నుంచి డబ్బులు వెనక్కీ రాబట్టుకుంటున్నాయన్నారు. ఇది నవ్వులాట కాదని భయంకరమైన సత్యం అన్నారు. పేదలకు విద్యా, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలని మిగతవేవి కూడా ఉచితం ఉండకూడదన్నారు. ఉచితాలు ఏమాత్రం మంచివి కాదని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు ఈ విషయాన్ని ఆలోచించాలన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com